

శుక్రవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూం ప్రాంతం



మండిన జిల్లా

25 మండలాల్లో 40 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు

- కొమరోలు, బేస్తవారపేటలో 42.6 డిగ్రీలు నమోదు
- పగలు ఎండ.. రాత్రి ఉక్కపోత
- వృద్ధులు, చిన్నారులు విలవిల
- మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. పక్షం రోజుల నుంచి తీవ్రత అధికంగా ఉండటంతోపాటు ఉక్కపోత ఎక్కువవడంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరవుతోంది. సాధారణంగా ఏప్రిల్ మూడో వారం నుంచి క్రమంగా ఎండ తీవ్రత ఉంటుంది. కానీ ఈ ఏడాది మార్చి ఆరంభం నుంచే పగటి పూట మంటలు, రాత్రిపూట ఉక్కపోత ఎక్కువైంది. జిల్లాలో శుక్రవారం ఎండలు మండిపోయాయి. అనేక మండలాల్లో 40డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా కొమరోలు, బేస్తవారపేటల్లో 42.6డిగ్రీల ఎండ కాచింది. ఉక్కపోతతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనులు చేసే కూలీలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో 38 మండలాలు ఉండగా 25మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఆరు గంటల వరకూ కూడా ఎండ తీవ్రత కనిపించింది.

40 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదైన మండలాల వివరాలు

మండలం	గరిష్ఠ ఉష్ణోగ్రత	మండలం	గరిష్ఠ ఉష్ణోగ్రత
బేస్తవారపేట	42.6	వెలిగండ్ల	41.5
కొమరోలు	42.6	హెచ్ఎం పాడు	41.5
దొనకొండ	42.5	రాచర్ల	41.2
మార్కాపురం	42.5	కంభం	41.2
పామూరు	42.1	అర్థవీడు	41.2
యర్రగొండపాలెం	41.7	చీమకుర్తి	40.7
మర్రిపూడి	41.7	కొత్తపట్నం	40.7
తర్లుబాడు	41.6	దర్శి	40.5
కురిచేడు	41.5	గిద్దలూరు	40.5

ఈకేవైసీ చేస్తేనే రేషన్ సరుకులు ఇస్తారు. లేకుంటే ఇక మర్చిపోవడమే.. ఇదీ ప్రస్తుతం కార్డుదారులను భయపెడుతున్న ప్రచారం. అదికూడా ఈనెల 31వతేదీలోపు చేయించుకోవాలని హడావుడి. అయితే అధికారుల ఆదేశాలకు భిన్నంగా రాష్ట్రప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేసేలా డీలర్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈకేవైసీ లేని రేషన్ కార్డుదారులు వెంటనే చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఐదేళ్లలోపు పిల్లలందరికీ మినహాయింపు ఇచ్చింది. ఆవిధంగా జిల్లావ్యాప్తంగా రేషన్‌షాపుల పరిధిలో ఈకేవైసీ చేయించుకోవాల్సిన కార్డుదారుల వివరాలను కూడా డీలర్లకు తహసీల్దార్లు అప్పగించారు. అయినా కుటుంబ సభ్యులు మొత్తం చేయించుకోవాలని డీలర్లు చెబుతుండటంతో అందరూ పరుగులు పెట్టాల్సి వస్తోంది.



ఒంగోలులోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇళ్ల వద్ద ఈకేవైసీ చేయిస్తున్న డీలర్

ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేస్తున్న రేషన్ డీలర్లు

లేని వారు చేయించుకోవాలని చెప్తున్నా అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నవైనం

ఈకేవైసీ గందరగోళం

- ఆధార్ కార్డులు తీసుకుని కుటుంబ సభ్యులు అందరూ రావాల్సిందేనని స్పష్టం
- పిల్లలు దూరాన ఉన్నా తప్పదంటూ హడావుడి
- జిల్లావ్యాప్తంగా 2.06 లక్షల మందికి మాత్రమే లేదు
- ఆ జాబితాలను డీలర్లకు ఇచ్చిన తహసీల్దార్లు
- అయినా మొండిగా వ్యవహరిస్తున్న పరిస్థితి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 6.61 లక్షల రేషన్ కార్డులు ఉండగా వాటి పరిధిలో 19.38 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 17.32 లక్షల మందికి ఈకేవైసీ ఉండగా 2.05 లక్షల మందికి లేదు. జిల్లాలో ఈకేవైసీ లేని వారి జాబితాలను రేషన్ డీలర్ల వారీగా తహసీల్దార్లు తయారుచేసి వారికి ఇచ్చారు. అయితే ఎవరికైతే ఈకేవైసీ లేదో అటువంటి వారికి ఫోన్లు చేసి పిలుపించుకొని ఈకేవైసీ చేయించుకోమని చెప్పాల్సింది పోయి, అందుకు భిన్నంగా వ్యవహరించడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. కార్డు ఉన్న కుటుంబ సభ్యులందరూ ఆధార్ కార్డులు తీసుకుని రావాలని హుకుం జారీ చేస్తున్నారు. ఒకవైపు అధికారులు ఈకేవైసీ లేని వారు మాత్రమే చేయించుకోవాలని చెప్తున్నా అవేమీ తమకు తెలియదన్నట్లు డీలర్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. అటువంటి వారు ఇక్కడకు రావాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని. ఆ విద్యార్థులకు ఈకేవైసీ లేకపోతే రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా చేయించుకునే అవకాశం ఉంది. ఆ విషయాన్ని చెప్పాల్సిందిపోయి 'లేదు తప్పనిసరిగా రావాల్సిందే.. లేకుంటే రేషన్ ఆగిపోతుంది' అని డీలర్లు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీంతో కార్డుదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి డీలర్ ఎక్కడ కూర్చుంటే అక్కడకు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో ఐదు రోజుల వ్యవధిలో సుమారు 50వేల మంది వరకూ ఈకేవైసీ వేయించుకున్నారని సమాచారం

నగరంలో ఇంటి వద్దకే వెళుతున్న డీలర్లు

జిల్లాకేంద్రమైన ఒంగోలులో రేషన్‌కార్డుదారుల ఇంటి సమీపంలోనే డీలర్లు కార్డుదారుల నుంచి ఈకేవైసీ చేయిస్తున్నారు. నిన్నమొన్నటి వరకు ఎక్కడో ఒక చోట కూర్చొని ఆ ప్రాంతానికి చెందిన కార్డుదారులను రైస్ కార్డుతోపాటు ఆధార్ కార్డులు తీసుకొని కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అందరూ రావాలని చెప్పారు. ఈ విషయం అధికారుల వద్దకు చేరడంతో ఈకేవైసీ ఎవరికైతే లేదో వారి చేతనే వేయించుకోవాలని స్పష్టంగా చెప్పడంతో శుక్రవారం నుంచి డీలర్లు అలాగే ప్రక్రియను చేపట్టారు. ఆ రేషన్ షాపు పరిధిలో ఉండే ఒక బజారులో ఒకచోటకు అక్కడి వారిని పిలిపించుకొని ఈకేవైసీ లేని వారి వద్ద నుంచి వేలిముద్రలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈకేవైసీ లేని కార్డుదారుల జాబితాలను డీలర్లకు ఇచ్చారు. దీంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.

ఈకేవైసీ లేని వారే చేయించుకోవాలి



తెల్లరేషన్ కార్డు ఉండి ఈకేవైసీ లేని వారు మాత్రమే చేయించుకోవాలి. ఐదేళ్లలోపు పిల్లలకు మినహాయింపు ఉంది. జిల్లావ్యాప్తంగా 2.06 లక్షల మందికి మాత్రమే ఈకేవైసీ లేదు. వారే చేయించుకోవాలి. ఈకేవైసీ ఉన్న వారు చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉంటే ఈపీడీఎస్ విధానం ద్వారా వారి రేషన్‌కార్డు నంబరును ఉపయోగించి ఈకేవైసీని చేయించుకునే అవకాశం కూడా ఉంది. అందువల్ల కార్డుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఎస్.పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

డీసీవో శ్రీనివాసరెడ్డి సరెండర్

- కలెక్టర్ అన్సారియా ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకారశాఖ అధికారి (డీసీవో) శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ శుక్రవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల సహకార శాఖలో జరుగుతున్న పలు పరిణామాలతోపాటు ఆ శాఖను సమన్వయం చేయడంలో ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో కలెక్టర్ అన్సారియా కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్రస్థాయిలో కూడా సహకార రంగంలో జిల్లా వెనుకబడి ఉంది. ఆ శాఖ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాల అమలులో కూడా శ్రీనివాసరెడ్డి ఉదాసీనంగా వ్యవహరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేశారు.



మాలపాటి వెంకటరెడ్డి



బైలడుగు బాలయ్యయాదవ్

రెండు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

- మార్కాపురం మార్కెట్ కమిటీకి వెంకటరెడ్డి.. గిద్దలూరుకు బాలయ్యయాదవ్

మార్కాపురం/గిద్దలూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు మార్కెట్ యార్డు కమిటీలకు చైర్మన్‌లను ప్రభుత్వం ప్రకటించింది. మార్కాపురానికి మాలపాటి వెంకటరెడ్డి నియమితులయ్యారు. గిద్దలూరు ఏఎంసీ చైర్మన్‌గా బైలడుగు బాలయ్యయాదవ్‌కు అవకాశం దక్కింది. రాష్ట్రప్రభుత్వం మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో జీవోను విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర పార్టీ కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 47 వ్యవసాయ మార్కెట్ కమిటీలను క్లియరెన్స్ ఇచ్చి మార్కెటింగ్‌శాఖకు పంపింది. అందులో జిల్లాలోని

మిగతా 4వ పేజీలో

1న పది సోషల్ పరీక్ష

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో చివరిదైన సోషల్ పరీక్ష ఏప్రిల్ 1న జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణపై కొంత సందిగ్ధం నెలకొంది. టైం టేబుల్‌లో కూడా మార్చి 31న లేదా ఏప్రిల్ 1న ఈ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. రంజాన్ పండుగ సెలవు మార్చి 31న ఇచ్చినందున ఏప్రిల్ 1న సోషల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు. విద్యార్థులు తేదీని గుర్తుపెట్టుకొని హాజరుకావాలని ఆయన కోరారు.

ముస్లింల అభివృద్ధే ధ్యేయం

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- సింగరాయకొండలో మారిటైం బోర్డు చైర్మన్ సత్య ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
- పాల్గొన్న ఎంపీ మాగుంట

4

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లావ్యాప్తంగా వేడుకలకు ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో ఆపార్టీది ప్రత్యేక ముద్ర
- కార్యక్రమాల నిర్వహణలోనూ ముందంజ
- మహానాడు నిర్వహణ మైలురాయి

ఒంగోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్న ప్రస్తుత సమయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని మరింత ఉత్సాహంగా నిర్వహించాలని అధిష్ఠానం సూచించింది. తదనుగుణంగా జిల్లాలో ఆ పార్టీశ్రేణులు గ్రామ, మండల, పట్టణ స్థాయిలో జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్‌లు, సభలు, సమావేశాల నిర్వహణ, పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎదురులేకుండా సాగుతున్న కాంగ్రెస్ పార్టీ హవాకు అడ్డుకట్ట వేసిన పార్టీగా టీడీపీకి రాజకీయాలలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎన్టీఆర్ సారథ్యంలో 1982 మార్చి 29న ఆవిర్భవించిన టీడీపీ 43 వసంతాలు పూర్తిచేసుకొని శనివారం 44వ ఏట అడుగుపెడుతోంది. ఈ 43 ఏళ్ల ప్రస్థానంలో అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులోనూ.. అధికారంలో లేనప్పుడు ప్రజల సమస్యలపై వారి పక్షాన నిలబడటంలోనూ ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక ముద్ర వేసుకుంది. ప్రజలకు



ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండా దిమ్మెను ముస్తాబు చేస్తున్న నాయకులు

మిగతా 4వ పేజీలో



వేదిక, హెలిప్యాడ్ రూట్ మ్యాప్‌ను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యేలకు వివరిస్తున్న డీఎస్పీ యశ్వంత్

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు
ముమ్మర ఏర్పాట్లు

పరిశీలించిన మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీ దివాకరపల్లి సమీపంలో ప్లాంట్ నిర్మాణానికి ఏప్రిల్ 2న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ భూమి పూజ చేయనున్నారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాలు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ఏర్పాట్లు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. బహిరంగ సభకోసం ఎంపికచేసిన ప్రాంతం, హెలిప్యాడ్‌లను నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా సభకు వచ్చే వీఐపీలకు, ప్రజలకు వేర్వేరుగా రోడ్డు మార్గాన్ని కేటాయించినట్లు డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ మంత్రి, కలెక్టర్‌కు మ్యాప్ ద్వారా వివరించారు. సభకు 600 మీటర్ల దూరంలో హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు. తక్షణమే నిర్మాణాలు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను మంత్రి స్వామి ఆదేశించారు. బహిరంగ సభకు అత్యధికంగా తరలివచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు. రెండు మార్గాలలో తగినంత పోలీసు సిబ్బందిని ఉంచాలన్నారు. వీఐపీలకు కేటాయించిన రోడ్డుమార్గంలో నిర్దేశించిన సమయం మించిన తరువాత ఇతర వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరివెంట జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఆర్డీవో కేశర్ధన్‌రెడ్డి, విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీవో ప్రభాకరశర్మ, విద్యుత్ ఈఈ ఉమాకాంత్, వివిధ శాఖల అధికారులు, రిలయన్స్ ప్రతినిధులతోపాటు టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, యారవ శ్రీనివాసులు, వేమూరి రామయ్య, మెడబలిమి వెంకట్రావు, కసిరెడ్డి హనుమారెడ్డి, ఉండేల మల్లికార్జున్‌రెడ్డి, కోమటిగుంట్ల వీరయ్య, కరణం చంద్రయ్య, కృష్ణారెడ్డి, కొండపనాయుడు, నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.



48 గంటల్లోనే చేతికందిన డబ్బు

కందుల కొనుగోలు వేళ.. అన్నదాతల ఆనందహేళ

- ప్రభుత్వ కేంద్రాల్లో వేగవంతంగా చర్యలు
- జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిన చిమట పాయింట్
- హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు

5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.27 (శనివారం సాయంత్రం)

సహర్ : 4.46 (ఆదివారం ఉదయం)

రెండు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

(3వ పేజీ తరువాయి)

గిద్దలూరుతోపాటు మార్కాపురం కమిటీ కూడా ఉంది. మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించి కూటమి ప్రభుత్వంలోని అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని జాబితాను స్థానిక శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. చైర్మన్‌గా మాలపాటి వెంకటరెడ్డి, వైస్‌చైర్మన్‌గా దొండపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా పిన్నెబోయిన రాజ్యలక్ష్మి, పసుపులేటి దేవప్రసాదరావు, కాటమల చెన్నమ్మ, పట్లావత్ భీమానాయక్, వట్టి రవణమ్మ, తానుగుండాల రామసుబ్బులు, చాతరాజుపల్లి వెంకటప్రవీణ్, రాచకొండ భారతి, దుగ్గెంపుడి వెంకటరవణమ్మ, షేక్ మస్తాన్‌బాబు, పూజల లక్ష్మి, పెరుమాళ్ల హరీష్‌బాబు, తడికమళ్ల భాస్కర్‌రావుల జాబితాను ప్రభుత్వానికి అందజేశారు. త్వరలోనే ప్రభుత్వం జీవోను విడుదల చేయనుంది.

గిద్దలూరుకు బాలయ్యయాదవ్

గిద్దలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బైలడుగు బాలయ్యయాదవ్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సిఫారసు మేరకు బాలయ్యయాదవ్‌ను ఈ పదవి దక్కింది. బైలడుగు బాలయ్యయాదవ్ టీడీపీ నాయకులుగా కొనసాగుతూ, వృత్తిపరంగా శల్యవైద్యునిగా ఈ ప్రాంతానికి సుపరిచితుడు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా బాలయ్యయాదవ్ పార్టీ కోసం పని చేస్తున్నారు. గడిచిన ఎన్నికలలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. త్వరలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా బాలయ్యయాదవ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే వైస్‌చైర్మన్, డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వైస్‌చైర్మన్, డైరెక్టర్ల నియామకం కోసం కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా బాలయ్యయాదవ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, మార్కెట్‌యార్డు ద్వారా గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డులు ఉన్నాయి. శుక్రవారం ప్రకటించిన జాబితాలో గిద్దలూరు ఉండగా కంభం మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్‌ను ప్రకటించాల్సి ఉంది.

బాలయ్యయాదవ్ బయోడేటా

పేరు : బైలడుగు బాలయ్యయాదవ్
పుట్టిన తేదీ : 03-06-1970
చదువు : ఇంటర్మీడియట్
వృత్తి : శల్యవైద్యులు, టీడీపీ పార్టీలో క్రియాశీలక నాయకునిగా ఉండడం
భార్య : రాజేశ్వరి
సంతానం : ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె

రాజకీయ అరంగేట్రం: నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాకర్షణ పాలనకు ఆకర్షితుడై 1996లో టీడీపీలో కార్యకర్తగా చేరి పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. తన గ్రామమైన గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ పంచాయతీలో పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేవారు. 1999లో నాటి ఎమ్మెల్యేగా పోటీ చేసిన పిడతల విజయ్‌కుమార్‌రెడ్డి విజయానికి బాలయ్య తన పంచాయతీ పరిధిలో విశేషంగా కృషి చేశారు. తద్వారా పార్టీలో చురుకైన నాయకునిగా ఎదిగారు. ఉయ్యాలవాడ పంచాయతీ పరిధిలోని ఉయ్యాలవాడ, సింగంపల్లి, అంకనాంపల్లి, సూరేపల్లి, లింగాపురం గ్రామాలలో అభివృద్ధికి తనవంతుగా కృషి చేశారు. ఆ తరువాత పార్టీలోనే కొనసాగుతూ 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన బైరబోయిన చంద్రశేఖర్‌యాదవ్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీపై ఉన్న అభిమానంతో బాలయ్య ఎక్కువ రోజులు ఆపార్టీలో ఉండలేక 2014 ఎన్నికలలో మళ్లీ టీడీపీ తరఫున పోటీ చేసిన అన్నా రాంబాబుకు మద్దతుగా నిలిచారు. పార్టీ కేడర్‌ను కూడా ఉత్తేజ పరుస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. నాటి నుండి నేటి వరకు ఎన్ని అడ్డంకులు వచ్చినా టీడీపీని విడలేదు. అదే క్రమంలో 2024లో జరిగిన ఎన్నికల్లో బాలయ్య గిద్దలూరు మండలంలో ముత్తుముల అశోక్‌రెడ్డి విజయానికి విశేషంగా కృషి చేసి ఆయన మన్ననలు పొందారు. ఆ కోవలోనే ముత్తుముల అశోక్‌రెడ్డి బైలడుగు బాలయ్య కృషిని గుర్తించి గిద్దలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా పదవి కట్టబెట్టారు.

ముస్లింల అభ్యున్నతే ధ్యేయం

మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
సింగరాయకొండలో సత్య ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు
పాల్గొన్న ఎంపీ మాగుంట

సింగరాయకొండ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనారిటీల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక ఈద్గామిట్టలోని షాదీఖానాలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి


ప్రార్థనల్లో మంత్రి స్వామి, మాగుంట, సత్య

కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వారికి రూ.5,434 కోట్లు కేటాయించిందని తెలిపారు. అందులో హజ్ యాత్రకు రూ.14 కోట్లు ఉన్నాయని వెల్లడించారు. ఇమామ్, మౌజమ్‌లకు గౌరవవేతనం ఇస్తూ ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ సింగరాయకొండతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గుండె సర్జరీ చేయించుకున్న తరువాత పార్లమెంట్ పరిధిలో తొలి కార్యక్రమం ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల ముస్లింలతో కలిసి ఇఫ్తార్ నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తొలుత ముస్లిం మతపెద్దలతో కలిసి స్వామి, మాగుంట, సత్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, మైనారిటీ నేతలు షేక్ సంధానీబాషా, యస్దానీ, అబ్దుల్ సుభాన్, సనావుల్లా, మతపెద్దలు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

● **ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్**

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఒంగోలులోని ఆర్టీసీ కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ డిపోలో పరిశుభ్రమైన వాతావరణం ఉంచాలన్నారు. అలాగే వేసవి కాలం అయినందున ప్రయాణికులకు అవసరమైన తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రత్యేకించి ఆర్టీసీ ఆదాయ వనరులు పెంచుకోవాలని తెలిపారు. బస్సులను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉంచుకోవడంతోపాటు సిబ్బంది సమన్వయం కలిగి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయా డిపోలలో సమస్యలపై డీఎంలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్ఎం వెంకట్రావు, ఒంగోలు డిపో మేనేజరు శ్రీనివాసరావుతోపాటు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, పొదిలి డిపో మేనేజర్లు, ట్రాఫిక్ అధికారులు, గ్యారేజీ అధికారులు పాల్గొన్నారు.

ఒకేరోజు రూ.93.84 లక్షల పన్నులు వసూలు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నులు చెల్లింపునకు పురపాలకశాఖ 50శాతం వడ్డీ రాయితీ ఇవ్వడంతో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న పన్నులు చెల్లింపులు వేగవంతం అయ్యాయి. ఈ మేరకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్‌తో ప్రచారం చేయడంతోపాటు, సచివాలయ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి పన్నుల వసూళ్ళపై దృష్టి సారించారు. ఈ మేరకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శుక్రవారం ఒక్కరోజులోనే రూ.93.84 లక్షలు వసూలు అయినట్లు తెలిపారు. వడ్డీ రాయితీతో పన్నులు చెల్లింపునకు మూడు రోజులే గడువు ఉందని, సెలవు రోజులు ఆదివారం, సోమవారం రంజాన్ రోజున కూడా కార్యాలయంలో పన్నుల చెల్లించవచ్చని, అందుకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

(3వ పేజీ తరువాయి)

అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పెద్దఎత్తున జరిగింది.

జిల్లా చరిత్రలో టీడీపీది ప్రత్యేక ముద్ర

టీడీపీ ఆవిర్భవించిన కొద్దినెలలకు జరిగిన ఎన్నికల (1983)లో ఉమ్మడి జిల్లాలో ఘన విజయాలను సాధించింది. అనంతరం జరిగిన పలు ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఏకపక్షంగా సాగిన 1994 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఒక్క పర్చూరు తప్ప మిగిలిన అన్నిచోట్లా టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. విభజిత రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభంజనం సృష్టించి టీడీపీ కేవలం 23 సీట్లకే పరిమితం కాగా ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలు టీడీపీకి దక్కాయి. తిరిగి 2024 ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం సృష్టించింది. ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో 10చోట్ల ఆపార్టీ అభ్యర్థులు గెలుపొందారు. పార్టీ ద్వారా పలు నియోజకవర్గాల్లో అనేకమంది యువకులు, కొత్తవారు ఎమ్మెల్యేలుగా ఇతర కీలక స్థానాల్లో వెలుగులోకి వచ్చారు. ఇక ఉమ్మడి జిల్లా అభివృద్ధిలోనూ టీడీపీది ప్రత్యేక ముద్ర అనే చెప్పాలి. ఉమ్మడి జిల్లా ఆవిర్భావం జరిగి 54 వసంతాలు కాగా టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధికి అనేక కార్యక్రమాలు జరిగాయి.

వెలిగొండకు ప్రాణం పోశారు

జిల్లాలోని పశ్చిమ ప్రజలకు వరప్రసాదినిగా భావించే వెలిగొండ ప్రాజెక్టు టీడీపీ హయాంలోనే కదిలింది. దాని కోసం సీపీఐ నేతృత్వంలో ప్రజానీకం చేస్తున్న ఆందోళనలను నాటి సీఎం ఎన్టీఆర్ గుర్తించి సర్వేకు ఆదేశించారు చంద్రబాబు సీఎం అయ్యాక 1996 మార్చి 5న తొలిసారి శంకుస్థాపన చేశారు. అనతరం పలు కీలక పనులు చేశారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికబద్ధ కృషి చేస్తున్నారు. అలాగే గుండ్లకమ్మ ప్రాజెక్టు, రామతీర్థం రిజర్వాయర్, రామాయపట్నం పోర్టు, ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీ వంటి వాటికి శంకుస్థాపనలు చంద్రబాబు చేశారు. చదలవాడ పశుక్షేత్రం ఏర్పాటు, ఒంగోలులో ప్రజల దాహార్తిని తీర్చే రెండు ఎస్ఎస్ ట్యాంకులు, కూరగాయల మార్కెట్, పెద్ద ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం వంటి కీలకమైన పనులు టీడీపీ కాలంలోనే జరిగాయి. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రోడ్లు, బ్రిడ్జిలు, ముఖ్యమైన భవన నిర్మాణాలు, తాగునీరు పథకాలు, విద్యుత్, విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన కృషి ఆ పార్టీ కాలంలోనే సాగింది. రాష్ట్రంలోనే తొలిగా పెద్ద సంఖ్యలో ఎత్తిపోతల పథకాలను గుండ్లకమ్మ, ముసి, పాలేరు ఇతర వాగుల ఆధారంగా చేపట్టడంతోపాటు పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ బోర్లు తవ్వకాలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే జరిగాయి. దొనకొండ కారిడార్‌కు నాంది టీడీపీ కాలంలోనే జరగ్గా ప్రస్తుతం కనిగిరి ప్రాంతంలో రియలన్స్ సంస్థ ఆధ్వర్యంలో బయోగ్యాస్ ప్లాంట్‌లు భారీ పెట్టుబడులతో ఏర్పాటు ఆ పార్టీ ప్రభుత్వ చొరవతో కార్యరూపం దాల్చుతున్నాయి.

ఒంగోలు మహానాడుతో ఊపు

జిల్లాలో టీడీపీ శ్రేణుల పనితీరు ఒక ఎత్తు కాగా.. జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైసీపీ అధికారంలో ఉన్న 2019-24 మధ్యకాలం ఒక ఎత్తు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అణిచివేత, అరాచకం, దాడులు ఎదుర్కొని జిల్లాలోని టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాయి. ప్రత్యేకించి ప్రభుత్వ దమననీతికి రాష్ట్రమంతటా విపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు గురవుతూ నోరు మెదపలేకపోతున్న సమయంలో అమరావతి రైతులు చేపట్టిన తిరుమల యాత్రకు ఉమ్మడి జిల్లాలో తెలుగు తమ్ముళ్లు బ్రహ్మరథం పట్టారు. తూర్పుప్రాంతంలోని ఆరు నియోజకవర్గాల్లో నెలరోజులకుపైగా సాగిన ఈ యాత్రను దిగ్విజయం చేసిన శ్రేణులు అంతకన్నా రెట్టించిన ఉత్సాహంతో 2022 మేలో ఒంగోలులో టీడీపీ మహానాడును నభూతో నభవిష్యత్ అన్నట్లు నిర్వహించారు. ఏకతాటిపై ఉమ్మడి జిల్లా టీడీపీ నాయకత్వం నిలిచి చరిత్రలో నిలిచేలా విజయవంతం చేసింది. తీవ్ర ప్రతికూల రాజకీయ పరిస్థితులలో మహానాడును ముందుకొచ్చి జిల్లానాయకులు నిర్వహించగా లక్షల్లో హాజరైన పార్టీశ్రేణులు వైసీపీ ప్రభుత్వంపై కదంతొక్కారు. ఆతర్వాతే రాష్ట్రంలో టీడీపీకి ఊపు వచ్చింది. ఇక 2023 జూలై, ఆగస్టు నెలల్లో జిల్లాలో నెలరోజులకుపైగా సాగిన యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రను ఇతర అన్ని జిల్లాల కన్నా సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. పార్టీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి నంద్యాల నుంచి విజయవాడకు తరలిస్తూ జిల్లాలోకి రాగా ఆ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. 50రోజులకుపైగా దీక్షలు, ధర్నాలు ఇతర ఆందోళనలు చేపట్టారు. ఇక ఐదేళ్లలో నిత్యం వివిధ ప్రజా సమస్యలపై పెద్దఎత్తున ఆందోళనలు చేస్తూ వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగా ప్రస్తుతం జరుగుతున్న పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు.

అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పద్మావతి

- వైస్ చైర్మన్‌గా కాపు సామాజికవర్గానికి కేటాయించే అవకాశం
- వరుసగా మూడోసారి కూడా మహిళకే
- వ్యవసాయ కుటుంబం, కూరగాయల సాగుదారులు కావడంతో అన్నగారి సంత గాడిలో పడుతుందన్న ఆశలో రైతులు


అద్దంకి వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వరగాని పద్మావతిని ప్రభుత్వం ప్రకటించింది. అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్సీ మహిళకు కేటాయించడం తో కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత మందా నాగేశ్వరరావు కుమార్తె, వరగాని ప్రసన్నకుమార్ సతీమణి పద్మావతిని నియమించారు. వైస్ చైర్మన్‌గా అద్దంకి పట్టణానికి చెందిన కాపు సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేతకు కేటాయించనున్నట్లు తెలుస్తుంది. డైరెక్టర్ల జాబితా శనివారం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అద్దంకి ఏఎంసీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు ఉన్నాయి. డైరెక్టర్ ల కేటాయింపులో అన్ని సామాజిక వర్గాలను, అన్ని మండలాలకు ప్రాధాన్యం ఉండేలా జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ప్రసన్నకుమార్, పద్మావతి కుటుంబం వ్యవసాయమే ప్రధాన జీవనం కావడం తో పాటు కూరగాయాల సాగు ఎక్కువగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అద్దంకి, మేదరమెట్లలో గత దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్న అన్నగారి సంతకు మరలా పూర్వ వైభవం వస్తుందనే ఆశను రైతులు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్ లు ప్రారంభించిన తరువాత వరుసగా మూడోసారి కూడా మహిళకే దక్కింది. గత వైసీపీ హయాంలో తొలుత బీసీ మహిళకు కేటాయించగా పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన భువనేశ్వరికి దక్కింది. రెండోసారి ఎస్సీ మహిళకు కేటాయించడం తో కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన జజ్జర ఈశ్వరమ్మకు దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎస్సీ మహిళకే దక్కింది. దీంతో వరుసగా మూడు సార్లు మహిళలు అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌లు అయ్యారు.

రైతులకు మేలు జరిగేలా కృషి



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తమ కుటుంబంపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తాను. రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తాను. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి, మేదరమెట్లలో ప్రారంభించిన అన్నగారి సంతకు పూర్వ వైభవం వచ్చే విధంగా కృషి చేస్తాను.

- వరగాని పద్మావతి
అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్

పమిడిపాడు మేజర్‌లో మహిళ మృతదేహం

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ సమీపంలోని ఎన్నెస్పీ కెనాల్‌లో శుక్రవారం రాత్రి మహిళ మృదేహం గుర్తించారు. కాలువలో శవమై కనిపించిన మహిళ మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బిట్రా అన్నపూర్ణ (55)గా గుర్తించారు. కోనంకి గ్రామానికి చెందిన బిట్రా వెంకటకోటేశ్వరరావు భార్య అన్నపూర్ణ గురువారం మార్టూరు మండలం వరపర్లలోని బంధువుల ఇంటికి వెళి తిరిగి వస్తూ ఇంటికి చేరుకోలేదు. అన్నపూర్ణ మృతదేహం కాలువలో కనిపించిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయానిన కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

ముసిపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సర్వే

అవీఇవీ

ముప్పవరం-గొర్లమిట్ట వద్ద ఏర్పాటుకు ప్రతిపాదన


ముసిలో పడవ పైవెళ్లి సర్వే నిర్వహిస్తున్న పీఆర్, ఇరిగేషన్ అధికారులు

కొండపి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం-గొర్లమిట్ట గ్రామాల మధ్య ముసిపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదేశాల మేరకు అధికారులు సర్వే ప్రారంభించారు. ముప్పవరం గ్రామ టీడీపీ నాయకుడు బత్తుల నారాయణస్వామి, పీఆర్ ఏఈ రమణయ్య, ఇరిగేషన్ ఏఈ రవికుమార్ ముసిలో పడవలపై వెళ్లి రెండు రోజుల క్రితం సర్వే నిర్వహించారు. ముప్పవరం నుంచి దాదాపు 600 మీటర్ల రోడ్డుతోపాటు లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు అంచనాలు రూపొందించనున్నారు. ఇది పూర్తయితే కొండపి పరిసరాల్లోని దాదాపు 30 గ్రామాల ప్రజలు ఒంగోలు వెళ్లేందుకు దగ్గరదారి ఏర్పడుతుంది. సంతనూతలపాడు, టంగుటూరు మండలాల్లోని పలుగ్రామాలతోపాటు కొండపి పరిసర ప్రాంతాలకు రాకపోకలు మెరుగుపడతాయని ప్రజలు అంటున్నారు.

ఫ్యామిలీ కోర్టు ఏపీపీగా శ్రీనారెడ్డి


శ్రీనారెడ్డి

ఒంగోలు క్రైం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పాలపర్తి శ్రీనారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంతనూతలపాడు మండలం మంగమూరుకు చెందిన శ్రీనారెడ్డి ఒంగోలులోని ఇందిరప్రియదర్శిని లా కాలేజీలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అనంతరం 1995లో న్యాయవాద వృత్తిలో చేరి పలు ముఖ్యమైన కేసులు వాదించారు. ఆయన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'ఈ-శ్రమ్' పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఈ-శ్రమ్ పథకంలో నమోదై 2022 మార్చి 31లోపు మరణించిన కార్మికులు ప్రమాద బీమా కోసం ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రీదేవి ఒక ప్రకటనలో కోరారు. మరణించిన కార్మికులకు రూ.2లక్షలు ప్రమాద మరణ బీమా, ప్రమాదంలో పూర్తి అంగవైకల్యం పొందిన కార్మికులకు రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద ఇంకా ఎవరైనా ప్రమాదం వల్ల చనిపోయిన వారు బీమాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని పరిహారం పొందాలని కోరారు. ఈ-శ్రమ్ పథకంలో జిల్లాలో ఇప్పటివరకు ఏడుగురికి రూ.14 లక్షల లబ్ధి చేకూరిందని వెల్లడించారు.

ఎమిలేరు, మట్టిగుంట వాగు అభివృద్ధికి రూ.2.64 కోట్ల నిధులు మంజూరు

నాగులుప్పలపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ పరిధిలోని ఎమిలేరు కాలువలు, మట్టిగుంట వాగు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.2.64 కోట్ల నిధులను మంజూరు చేసింది. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సమీపంలోని మట్టిగుంట వాగు అభివృద్ధికి రూ.49.42లక్షలు, ఎమిలేరు కాలువ పరిధిలోని 18.4 కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం చేసేందుకు రూ.67.60 లక్షలు, 16వ కిలోమీటరు వద్ద ఎమిలేరు కాలువ అభివృద్ధి చేయడంతో పాటు మట్టిగుంట వాగు కలిసే ప్రదేశంలో అండర్ టన్నెల్ నిర్మాణం చేపట్టేందుకు రూ.1.47 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో నంబరు 153 జారీ చేసింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మట్టిగుంట వాగు అభివృద్ధికి నోచుకోక పూడికతో నిండిపోయి వర్షాకాలంలో వరదనీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. దీంతో చుట్టు పక్కల పంట పొలాల్లోకి నీరు చేరి ప్రతి ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం మట్టిగుంట వాగు అభివృద్ధితో పాటు దానికి అనుసంధానంగా ఉన్న ఎమిలేరు కాలువలు అభివృద్ధి, అండర్ టన్నెల్ నిర్మాణానికి నిధులు విడుదల చేయడంపై పలు గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చాకు మేస్త్రీలు మోసం చేశారు..

● **న్యాయం కోసం బాధిత రైతుల ఆవేదన**

మద్దిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పచ్చాకు మేస్త్రీలు ఒప్పందం ప్రకారం పనులు చేయకుండా మోసం చేశారని నాగన్నపాలెం గ్రామానికి చెందిన రైతులు కాకర్ల వెంకటసురేష్‌బాబు, అడ్డాల హనుమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కూలి డబ్బులు ఎగవేసినట్లు తమపై కూలీలు ఫిర్యాదు చేశారని, అయితే తాము ఎవరినీ మోసగించలేదని, కూలీలు రాత్రికి రాత్రే గుడిసెలు ఖాళీ చేసి వెళ్లిపోయారని వాపోయారు. వివరాల్లోకి వెళితే.. బాపట్ల జిల్లా అద్దంకి మండలం చెరువుకొమ్ముపాలెంకు చెందిన గాని పునరుద్ధరణరావు గత ఏడాది ఫిబ్రవరి 22న తమతో పొగాకు కొట్టడం, అల్లిక, బ్యారన్ కాల్చు పనికి, ఆకు పూర్తయ్యేంతవరకు జతకు రూ.2.69 లక్షల చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. కొంత మొత్తంలో అడ్వాన్సులు తీసుకున్నారు. ఒప్పందం మేరకు ఆకు పూర్తయ్యేంత వరకు పనిచేయకుండా కేవలం ఎనిమిది వరసలు కొట్టి రాత్రికి రాత్రే కూలీలతో ఉడాయించారు. అర్ధంతరంగా పచ్చాకు పనులు నిలిపివేయడంతో రైతు అడ్డాల సుబ్బారావు మానసిక వ్యధకు గురై ఈ ఏడాది జనవరి 2వ తేదీన మృతి చెందారు. కూలీలు లేక పచ్చాకు ఎండిపోయి సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతులు కాకర్ల వెంకటసురేష్‌బాబు, అడ్డాల హనుమయ్య తెలిపారు. ఈ విషయంపై ఈనెల 19న మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారించి తమకు తగిన న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలో విజేతగా నిలవాలి

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో నైపుణ్యం చాటి విజేతగా నిలవాలని తహసీల్దార్ పి.సింగారావు చెప్పారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఖోఖో రాష్ట్ర పురుషుల జట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం సీతారామిరెడ్డి, ఉషారెడ్డి సమకూర్చిన క్రీడా దుస్తులను తహసీల్దార్ క్రీడాకారులకు అందచేశారు. కార్యక్రమంలో కోచ్ డీఎల్ రెడ్డి, మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర పురుషుల జట్టు...

ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పురుషుల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టును అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శుక్రవారం ప్రకటించారు. ఈ జట్టులో కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, కె.మహేష్, ఎం.ప్రసాద్, ఎ.వీరాంజనేయులు(ప్రకాశం), జె.నితేష్, వి.భానుప్రసాద్, పి.నరసయ్య (విజయనగరం), జి.సంతోష్ (అనంతపురం), ఎం.సాయివెంకట్(తూ.గో), హెచ్.రాజేష్ (చిత్తూరు), కె.ప్రవీణ్ (శ్రీకాకుళం), బి.కిరణ్ (విశాఖ), వై.వర్షిత్ ముకుందయాదవ్(కృష్ణ), స్టాండ్ బైగా జి.నాగవెంకటశివ(ప్రకాశం), హరిప్రసాద్ (కడప) పాల్గొంటారని తెలిపారు.


జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టు

పగలు ఎండ.. రాత్రి ఉక్కపోత.. ఉదయం మంచు..!



కొప్పోలురోడ్డులో కురుస్తున్న పొగమంచులో వస్తున్న వాహనదారులు



ఎండ తీవ్రతతో గొడుగు కింద వస్తున్న తల్లీపిల్లలు

- నగరంలో విభిన్న వాతావరణం
- మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
- అల్లాడుతున్న ప్రజానీకం

గత పది రోజుల్లో నగరంలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

తేదీ	గరిష్ఠ	కనిష్ఠ
20.3.25	35.3	26.5
21.3.25	34.7	26.2
22.3.25	34.3	24.5
23.3.25	34.5	27.5
24.3.25	35.0	26.6
25.3.25	34.5	25.5
26.3.25	34.8	25.4
27.3.25	36.5	25.4
28.3.25	37.5	26.1

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో విభిన్న వాతావరణం నెలకొంది. పగలు ఎండ, రాత్రి ఉక్కపోత, ఉదయం మంచు కురుస్తోంది. గత పక్షం రోజులనుంచి ఎండ అధికంగా ఉండటంతో పాటు ఉక్కపోత పోస్తుండటంతో ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిన్నా మొన్నటి వరకు మంచు పడుతుండగా శుక్రవారం మాత్రం ఒంగోలును మంచు కమ్మేసింది. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు ఉంటుండగా రాత్రి ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరుగుతూ ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది డిసెంబరులో కురిసిన భారీ వర్షాల కారణంగానే ఇలాంటి స్థితి ఏర్పడిందని నిపుణులు చెప్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో పగటి సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుండటంతో ప్రజలు మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఎండ ఉన్నా ప్రస్తుత సమయంలో చల్లగాలి వస్తోంది. దానివల్ల ఎండ పెద్దగా అనిపించేది కాదు. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా ఎండ తీవ్రతతో పాటు వేడిగాలులు వస్తున్నాయి. గాలి లేని కారణంగా పగటి పూట కూడా ఉక్కపోత పోస్తున్నది. ఇక రాత్రి సమయంలో కూడా అదే పరిస్థితి ఏర్పడింది. ఫ్యాన్లు తిరుగుతున్నా వెచ్చటి గాలి వస్తుండటంతో ప్రజానీకం వాటిని పక్కన పెట్టి కూలర్లు, ఏసీలను వినియోగించాల్సి వస్తోంది. మరో వైపు వీధి వ్యాపారులు కూడా ఎండ తీవ్రతతో రోడ్లపై ఎక్కువ సేపు ఉండటం లేదు. ఇంకొక వైపు ప్రజానీకం చల్లటిపానియాల కోసం ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎక్కడా ఉచితంగా మంచినీరు చిక్కే పరిస్థితి లేకపోవడంతో డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మధ్యాహ్న సమయంలో ప్రజలకు అందిస్తున్నారు.

బీఎన్‌ను కలిసిన ముస్లిం నాయకులు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ఇమామ్‌ఏజమీన్ కడుతున్న ముస్లింలు

చీమకుర్తి, మార్చి28(ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా చీమకుర్తికి చెందిన ముస్లిం నాయకులు ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ని కలిశారు. మేప్రొంవతో సన్మానించి, ఇమామ్ ఏ జమీన్ కట్టి సంప్రదాయబద్ధంగా సత్కరించారు. ముస్లింలకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ జిలాని, రఫీ, అహ్మద్‌బాషా, అబుసలే, అమానుల్లా, కరీం, సయ్యద్ రఫీ, జిలాని, సాధిక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవులకు ఉగాది పురస్కారం



సన్మానం అందుకున్న కవులు

ఒంగోలు కల్చరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన పలువురు కవులకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది పురస్కారాను అందజేశారు. శుక్రవారం నెల్లూరులోని అధ్యయన కేంద్రంలో జరిగిన ద్విశతాధిక జాతీయ ఉగాది కవి సమ్మేళనంలో అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ఇతర ముఖ్యఅతిథుల చేతుల మైనంపాటి సాయికుమార్, నెమ్మాని సీతారామ్మూర్తి, నెమ్మాని హరిప్రియాదేవి, జాలాది మోహన్, బంతికట్ల నాగేశ్వర్‌రెడ్డి, గర్నెపూడి యోబు, దేవరకొండ ప్రసన్న తదితరులు పురస్కారాలను అందజేశారు. ఉగాది ఈ సందర్భంగా వారిని పలువురు జిల్లా సాహిత్యవేత్తలు అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో వీరు కవితలను వినిపించారు.

డ్వాక్రా రుణ ప్రణాళికలను రూపొందించాలి



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాసప్రసాద్

ఒంగోలు(రూరల్), మార్చి28(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సభ్యుల రుణాల ప్రణాళికలు తయారు చేయాలని ఏపీఎం శ్రీనివాసప్రసాద్ కోరారు. ఒంగోలులోని మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో మహిళలు తీసుకున్న రుణాలను గుర్తించాలన్నారు. వివిధ వృత్తులు, వ్యాపారాలు, వ్యవసాయం, పాడిపరిశ్రమ, కుటీర పరిశ్రమలు లాంటి వృత్తులను ప్రణాళికల్లో వివరించాలని కోరారు. డ్వాక్రా గ్రూపుల్లో ఎవరైనా మృతి చెందితే వారి స్థానంలో కొత్తవారిని చేర్చాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఎక్స్‌పోలో రైజ్ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల నిర్వాహకులు

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్‌కృష్ణసాయి ప్రకాశం గ్రూపు ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్‌ఈ విభాగానికి చెందిన విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక కళాశాలల్లో జరిగిన ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్ ప్రదర్శనలో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. లోయ ప్రాంతాలు, యూటర్న్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు, అధిక విద్యుత్ ఓల్టేజీ కారణంగా గృహోపకరణాల రక్షణ, డ్రైవర్ నిద్రలేమి కారణంగా జరిగే ప్రమాదాల నివారణ తదితర అంశాలకు ప్రథమ బహుమతి, పోస్టర్ థీమ్/టైటిల్-ఇండోర్ హోమ్ మానటరింగ్, కంట్రోఏసిస్టర్ డిజైన్ అమలు అంశాలకు సంబంధించి పోస్టర్ ప్రజంటేషన్‌లో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో బహుమతులు సాధించిన విద్యార్థులను సెక్రటరీ శిద్దా హనుమంతరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, విభాగాధిపతి సంతోష్ తదితరులు అభినందించారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280

మద్దిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280 పలికింది. కొరిశపాడు క్లస్టర్ దైవాలరావూరు, మేదరమెట్ల రైతులు 229 బేళ్ల అమ్మకానికి తీసుకురాగా కనిష్ఠ ధర రూ.270 లభించిందని కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. చంద్రపాడు రైతులు 245 బేళ్లు తీసుకురాగా ఐదు బేళ్లను తిరస్కరించారు. వేలంలో పలు కంపెనీల మేనేజర్లు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగులు టీచర్లను ఎయిడెడ్ స్కూళ్లలో నియమించాలి

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని పాఠశాలల్లో పని చేస్తున్న ఎయిడెడ్ టీచర్లు, 40మందిలోపు పిల్లలు ఉన్న పాఠశాలల్లో మిగులుగా తేలిన ఎయిడెడ్ టీచర్లను శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల్లో నియమించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 23న సీనియారిటీ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ స్కూళ్లకు కేటాయించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జరుగుమల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హర్దీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జరుగుమల్లి, పంగులూరివారిపాలెం, చింతలపాలెం, నందనవనం, దావగూడూరు, వావిలేటిపాడు గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెత్త తరలింపులో జాగ్రత్తలు పాటించాలి

- రోడ్లపై పడకుండా యార్డుకు తరలించాలి
- కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం



ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థలోని తన కార్యాలయంలో చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్ ట్రక్కుల ఎత్తును పెంచాలన్నారు. చెత్తను తరలించే క్రమంలో రోడ్లపై పడకుండా చూడాలని చెప్పారు. అలాగే ప్రతి డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. కార్పొరేషన్‌కు కేటాయించిన ట్రాక్టర్‌కు సీబుక్, ఇన్సూరెన్స్ అన్నీ ఫోర్స్‌లో ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటలోపు పనులు పూర్తి చేయాలని అన్నారు. ప్రతి ట్రాక్టర్‌కు జీపీఎస్ ఏర్పాటు చేసి, వాహనం ఎక్కడ తిరుగుతుందో పర్యవేక్షించాల్సిన బాధ్యత శానిటరీ అధికారులపై ఉందని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ డొక్కా కొండయ్య, శానిటరీ సూపర్‌వైజర్లు షేక్ బాబ్జి, పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. అంతకముందు నగరంలోని సీవీఎన్ క్లబ్ సమీపంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను కమిషనర్ పరిశీలించారు. నాణ్యత లోపం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు



చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు క్రైం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీల భారం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం భరాయించాలని, సర్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్టుమీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ స్మార్టుమీటర్ల విధానాన్ని వ్యతిరేకించిందని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గత విధానాలను కొనసాగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, బాలకోటయ్య, రమాదేవి, తంబి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు సబ్‌స్టేషన్‌వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం విద్యుత్ కార్యాలయ అధికారి లక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంతిబాబు, శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, వెంకటేశ్వర్లు, మాదాసు నాగేశ్వరరావు, రావెళ్ల వెంకట్రావు, కె.శ్రీను, సురేష్, రామాంజనేయులు, యోనా పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి : ట్రూఅప్, సర్దుబాటు చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్‌మీటర్లు ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం చీమకుర్తి విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, బెజవాడ శ్రీను, శీలం ఆదినారాయణ, కొండయ్య, ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్ పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మద్దిపాడు విద్యుత్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమలో ఉబ్బా ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, వెంకటరామిరెడ్డి, ఉబ్బా వెంకటేశ్వర్లు, శ్రీను, హరిబాబు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో...

కొండపి: సర్దుబాటు పేరుతో ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు కేజీ.మస్తాన్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వందనం, మాధవరెడ్డి, బ్రహ్మయ్య, ఏసోబు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా రేషన్‌కార్డుల ఈకేవైసీ

- చీమకుర్తిలో 90శాతంకు పైగా పూర్తి



నేకునంబాదులో రాత్రివేళలో ఈకేవైసీ చేస్తున్న రేషన్ సిబ్బంది

చీమకుర్తి, మార్చి28(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ కార్యక్రమం చీమకుర్తి మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. ఈనెల 31వ తేదీ తుదిగడువు కావటంతో సిబ్బంది రాత్రి వేళల్లో సైతం నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ బ్రహ్మయ్య ఈ కేవైసీ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండటంతో మండలంలో 90శాతంకు పైగా పూర్తి అయింది. మండల పరిధిలో రేషన్‌కార్డుల్లోని సభ్యులు 69,536 కాగా వీటిలో 63,051మందికి ఈకేవైసీ పూర్తి చేశారు. ఇంకా 6,485 సభ్యులవి చేయాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న సభ్యులకు గడువులోపు పూర్తిచేస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. సచివాలయాల్లో కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చని చెప్పారు.

రైతులందరికీ యూనిక్ నంబర్ : డీడీ



మాట్లాడుతున్న డీడీ విజయనిర్మల

సంతనూతలపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, పంటల సాగుకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు యూనిక్ నంబరు అవసరమని ఆత్మ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం.విజయనిర్మల పేర్కొన్నారు. శుక్రవారం పేర్నమిట్టలో జరుగుతున్న రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో పావని మాట్లాడుతూ మండలంలోని 9,173 మంది రైతులు ఉన్నారని, 6300 మంది పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులలో 6003 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన రైతులు ఈనెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కేవీ.సుబ్బారెడ్డి, ఎంపీఈవో జానకి పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను సందర్శించిన డీఈవో

కొండపి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయాన్నే కొండపి చేరుకున్న ఆయన పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా పత్రాలు ఆయా కేంద్రాలకు చేర్చే ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం వివిధ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దోస్తీ ఫౌండేషన్ చేయూత

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పురస్కరించుకుని దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు అందజేశారు. శుక్రవారం స్థానిక గుంటూరురోడ్‌లోని పద్మావతి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ జహంగీర్ చేతుల మీదగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ రంజాన్ పర్వదినం పురస్కరించుకుని గత పేళ్లలగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, తదితర సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దన్నారపు మస్తాన్ రావు, జానీ, షేక్ అబ్దుల్‌రవూఫ్, నత్తల శ్రీనివాసరావు, తిరుపతిరావు, సలార్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికలను తయారు చేయాలి

కొండపి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఆర్థిక సంవత్సరానికి స్వయం సహాయక సంఘ సభ్యుల కుటుంబాల జీవనోపాధులు పెంపొందించేందుకు ప్రణాళికలను తయారు చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణకుమారి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అనకర్లపూడి క్లస్టర్ పరిధిలోని వీవోఏలు, ఎన్యుమరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఏపీఎం గోపీనాథ్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తప్పుడు నివేదికలు తయారు చేయకుండా సక్రమమైన డేటాను ఇవ్వాలన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మర్రిపూడి కామేశ్వరి, సీసీలు కృష్ణారెడ్డి, రమణమ్మ, మల్లికార్జున, గోవిందమ్మ, రామాంజనేయులు, అకౌంటెంట్ కోటేశ్వరి పాల్గొన్నారు.

కనిగిరి డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలి

- డీఆర్వోకు సీపీఎం వినతి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ.కొండారెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేషును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వెలిగొండ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు నిధుల కేటాయింపుతో పాటు నిలిచిపోయిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. వెలిగొండ పరిధిలో పీసీపల్లి, పొదిలి, మర్రిపూడి, కురిచేడు మండలాల్లోని అన్ని గ్రామాలను కలపాలని, కనిగిరి నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్‌లలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలన్నారు. కనిగిరి, పొదిలి, దర్శి పట్టణాల్లో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన స్కీంలను పూర్తి చేయడంతో పాటు ఆ డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా మెరుగుపర్చాలన్నారు. దర్శిలో జాతీయ డ్రైవింగ్ స్కూలు నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు ట్రిపుల్ ఐటీ కాలేజీ నిర్మించే స్థలం వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.వినోద్, కేఎఫ్.బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

మద్దిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. కనుక నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సీఎస్ఐటీ విద్యార్థులకు సొల్యూషన్ ఫిట్ అండ్ ప్రొడక్ట్ మార్కెట్ ఫిట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీఏ అసోసియేట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైన నూతన వస్తువుల మార్కెటింగ్, వాటి ఉత్పత్తి అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, శ్రీనివాసరావు, అభిషేక్ పాల్గొన్నారు.

ఆక్వాకల్చర్ విద్యార్థులకు అభినందన

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీలో డిపార్ట్ ఆఫ్ మెరైన్ బయాలజీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సెమినార్‌కు హాజరైన ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఆక్వా కల్చర్ విద్యార్థులను వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి.రాజమోహన్‌రావు అభినందించారు. సెమినార్‌కు హాజరైన విద్యార్థులు తమ అనుభవాలను వీసీకి వివరించారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శని, ఆదివారాల్లో నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. శనివారం ఉదయం స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10.30 గంటలకు టీడీపీ కార్యాలయంలో జరిగే టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొంటారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలులో ఉగాది వేడుకల్లో, అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు.

రేపు సంగీత విభావరి

ఒంగోలు విద్య, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్‌రూం ఆవరణలో స్వరరాగా గంగా ప్రవాహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల స్వరంతో ఈ విభావరి నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ బృందం తెలిపింది. ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని వారు కోరారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక గోపాలనగరంనకు చెందిన ఆటోడ్రైవర్ రంగాశెట్టి శాంతారావుకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ప్రతినిధులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేటు హాస్పటల్‌లో మెదడుకు సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్నట్లు క్లబ్ ప్రతినిధులకు సమాచారం రావడంతో రూ.22వేల నగదును అందించారు. కార్యక్రమంలో క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, కార్యదర్శి గ్రంధి పార్థసారధి, పూర్వ అధ్యక్షుడు తమ్మన ఆంజనేయులు, మిరియాల కృష్ణ, వంకదార సతీష్, రాంబాబు, బియ్యను విజయ్, శ్రీనివాసరావు, చంద్రమాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్‌మాదిగ కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో చిన్నఓబులేషును కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కొలకలూరి విజయ్‌కుమార్, తేళ్ళ జయరాజ్, పట్రా బంగారం, వంశీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సదరన్ పెస్ట్ కంట్రోల్ ఫ్యాక్టరీలో తనిఖీలు

మద్దిపాడు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమలకేంద్రంలో గల సదరన్ పెస్ట్ కంట్రోల్ ఫ్యాక్టరీని వ్యవసాయశాఖ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా రికార్డులను, ఫ్యాక్టరీలో తయారు చేసే మందులను పరిశీలించింది. అనంతరం యాజమాన్యంతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్‌నాయక్, రమేష్‌బాబు, వెంకటేశ్వరరావు, మద్దిపాడు ఏవో కె.రమేష్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

దివ్యాంగుల ఇళ్లవద్దనే పరిశీలించాలి

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్ల పరిశీలన ప్రక్రియను దివ్యాంగుల ఇళ్ల వద్దనే చేపట్టాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ల పరిశీలన పారదర్శకంగా ఉండాలన్నారు. అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలన్నారు. నడవలేని పరిస్థితిలో, మంచానికే పరిమితమైన వారి నివాసాల వద్దకే వైద్యశాఖ అధికారులు వెళ్లి విచారించాలన్నారు. జిల్లా అధికారులు, నాయకులు స్పందించి దివ్యాంగుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని విచారణ చేపట్టాలని అన్నారు.

రైలు ఢీకొని ఒకరు మృతి

రాచర్ల (గిద్దలూరు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలం గుడిమెట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేటు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు జరిగిందా అనే విషయంపై రైల్వేపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో యాచకుడిగా భావిస్తున్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

● లబోదిబోమంటున్న దస్తగిరి


మృతిచెందిన గొర్రెలు

తర్లుపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటలో గొర్రెలమందపై శుక్రవారం ఉదయం కుక్కలు దాడిచేశాయి. దీంతో ఏడు గొర్రెలు మృతిచెందాయి. మరో ఐదు గొర్రెలకు గాయాలయ్యాయి. షేక్ దస్తగిరికి చెందిన గొర్రెల మంద ఊరి శివారులో ఉండగా ఒక్కసారిగా పది కుక్కలు కలిసి గొర్రెల మందపై దాడి చేశాయి. సుమారు రూ.1.4లక్షలు విలువైన గొర్రెలు మృతి చెందటంతో దస్తగిరి లబోదిబోమంటున్నారు. చనిపోయిన గొర్రెలకు ప్రభుత్వం బీమా ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇటీవల కుక్కలు మనుషులపై కూడా దాడి చేస్తుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను పట్టించి అడవుల్లో వదిలి వేయాలని కోరుతున్నారు.

పగడ్బందీగా పదోతరగతి పరీక్షలు


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

బేస్తవారపేట, మార్చి28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీతేంద్ర, ఎస్సై రవీంద్రారెడ్డిలు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంచామన్నారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు తహశీల్దార్ జీతేంద్ర జిల్లా పరిషత్ బాలుర,బాలికల హైస్కూల్‌కు వెళ్లి పరిశీలించారు.

ఆకాశవాణిలో కవి సమ్మేళనం


కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఆకాశవాణి కేంద్రంలో విశ్వావసు, సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ నెల 30న కవిసమ్మేళనాన్ని ప్రసారం చేస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహణ అధికారి బి.ప్రశాంత్‌కిరణ్ తెలిపారు. స్థానిక ఆకాశవాణి కేంద్రంలో కవుల కవిసమ్మేళనం, రికార్డింగ్ నిర్వహించారు. 30న ఉదయం 7.15గంటలకు కవి సమ్మేళనం ప్రసారం అవుతుందన్నారు. ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కవులు డాక్టర్ కె.మధుసూదన్‌శాస్త్రీ డాక్టర్ ఏ.వీరారెడ్డి, డి.విశ్వనాథం, ఎల్.అరుణ, డా. ఎన్.అంకమరావు, శ్రీనివాసచార్యులు, పి.మల్లికార్జునరావు, ఎంవీ.సుబ్బారావులు పాల్గొని ఉగాది విశిష్ఠతను తెలిపారన్నారు. ఈ కవి సమ్మేళనానికి డా.మధుసూదనశాస్త్రి అనుసంధాన కర్తగా వ్యవహరించారని తెలిపారు.

హ్యాండ్ రైటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొమరోలు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు అక్షర హ్యాండ్‌రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్టులో స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కొమరోలు ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న షేక్ యాస్మిన్, బి.వర్షిణి, సాత్విక్, షేక్.ముస్కాన్, కే.మానసలు ప్రతిభ చాటారు. వీరికి అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ వారు బహుమతులను అందజేశారు. వీరితో పాటు మరో 12 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏరువ రేవతి మాట్లాడుతూ, విద్యార్థులోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిభ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. అప్పుడే పోటీ ప్రపంచంలో తమ విద్యార్థులు రాణించ గలరన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు విద్యతో పాటు అన్నిరంగాల్లో ప్రతిభను కనబరచాలన్నారు. కార్యాక్రమంలో హ్యాండ్ రైటింగ్ నిపుణులు మల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర రుణ ప్రణాళికను తయారు చేయాలి

● పీడీ నారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పొదిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్యూమరేటర్స్‌ను సమావేశపరిచి ఖచ్చితమైన రుణప్రణాళిక తయారు చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ పి నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక ఎన్యూమ రేటర్లు, వీవోఏల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2025-26కు సంబంధించి సభ్యులకు ఏ నెలలో ఎంత అవసరమౌతుందో యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అందుకు వీవోఏలు, ఎన్యూమరేటర్స్ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపాలక్రిష్ణ, సీసీలు రాజయ్య, కె వెంకటరెడ్డి, యం దాసు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నీసా, శ్రీదేవి పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులకు మోక్షం

● నిధులు వెచ్చించేందుకు ఆర్థిక శాఖ అనుమతి ● హర్షం వ్యక్తం చేస్తున్న పొదిలి ప్రజలు


రహదారి పొడవునా తేలిన పైపులు

పొదిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొదిలి సమ్మర్ స్టోరేజ్ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ పనులకు కూటమి ప్రభుత్వం ఆర్థికశాఖ అనుమతులు ఇవ్వడంతో పనుల్లో వేగం పుంజుకోనుంది. దీంతో పొదిలి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమ్మర్ స్టోరేజ్ పనులను వైసీపీ హాయాంలో ప్రారంభించారు. ఈ పనులు ప్రారంభించిన ఘనత తమదే అని ఊరువాడ డంకాబజాయించి మరి ప్రచారం చేసుకున్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటం ఈ పనులు ప్రారంభించారు. అయితే ఈ పనులకు ఆర్థికశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కాలేదు. సాంకేతిక ఇబ్బందులు కారణంగా ప్రారంభించిన పనులను అర్థాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో పొదిలి మండల ప్రజల చిరకాల కళ అందని ద్రక్షలా మారింది. ఒకదశలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. ఈ నేపథ్యంలో గత జనవరి నెలలో 'ఇంతమోసమా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ప్రభుత్వం స్పందించింది. స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చొరవతోపాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారుల కృషి ఫలితంగా సమ్మర్‌స్టోరేజ్ పనులకు సంబంధించిన అడ్డంకులు తొలగాయి. రూ.50కోట్ల అంచనాలతో రూపొందించిన పనులకు ఆర్థికశాఖ నుంచి ఆమోదం లభించింది. దీంతో సమ్మర్‌స్టోరేజ్ నిర్మాణ పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే దర్శి నుండి పొదిలి వరకు 3 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులు పూర్తయ్యింది. మరో 15 కిలోమీటర్ల మేర అవసరమైన పైపులను సేకరించారు. పైపులను అమర్చేందుకు మట్టికాలువ పనులు కూడా పూర్తికావచ్చాయి. ఇప్పటివరకు కాంట్రాక్టర్ రూ.10 కోట్లకు పైగా పనులు పూర్తి చేశారు. అందుకు సంబంధించిన బిల్లులు చెల్లించే సమయంలో ఆర్థిక అనుమతులు లేవనే విషయాన్ని అధికారులు గుర్తించడంతో ఒక్కసారిగా అధికారులు, కాంట్రాక్టర్ ఖంగుతిన్నారు. దీనికితోడు ప్రభుత్వం మారడంతో పనుల పురోగతిపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఎన్నిలకు ముందు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని కూటమి నేతలు ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ మేరకు మాట నిలుపుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆర్థిక అనుమతులు ఇప్పించేందుకు తీవ్రంగా కృషి చేశారు. అవసరమైతే నిర్మాణ పనుల కాలపరిమితిని పెంచి వీలైనంత త్వరలో పనులు పూర్తి చేయిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఏప్రిల్ నెలలో పనులు వేగవంతంగా చేపడతామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఏర్పడిన అడ్డంకులు తొలగి పోవడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో స్టోరేజ్ నిర్మాణం వలన ఈ ప్రాంతంలో భూగర్భజలాలు పెరగడంతోపాటు పరోక్షంగా వ్యవసాయంపై సానుకూల ప్రభావం కనపడే అవకాశం ఉంది.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28 ఆంధ్రజ్యోతి: వక్ఫ్ బోర్డుపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ, మార్కాపురం పట్టణంలో ముస్లింలు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి మౌన నిరసన తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు జామీయా మస్జీద్, చిన్న మస్జీద్‌ల వద్ద జుమా నమాజ్ అనంతరం ముస్లింలు నిరసన తెలిపారు. జామీయా మస్జీద్ వద్ద ముతవల్లి మీర్జా సబ్దుల్ అలీబేగ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది సయ్యద్ జావీద్ అన్వర్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి విజన్ అధ్యక్షులు మొఘల్ జాబీర్ హుస్సేన్ బేగ్, చిన్న మస్జీద్ వద్ద ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరుటౌన్ : కేంద్రప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వక్ఫ్‌బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం గిద్దలూరులో ముస్లింలు నిరసన తెలిపారు. పట్టణంలోని రాచర్ల రోడ్డులో మక్కామసీదులో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐఓ జాతీయ కార్యదర్శి రోషన్‌మొహిద్దీన్ మాట్లా డుతూ ప్రస్తుతం వక్ఫ్ సవరణ బిల్లు వలన ముస్లింలకు తీవ్రమైన అన్యాయం జరుగు తుందని ఆందోళన వ్యక్తం చేశారు..

పొదిలి : పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పెద్దమసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బిల్లును వెంటనే రద్దుచేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ భారత పౌరులుగా ఇస్లామిక్ చట్టంపై మత విశ్వాసాన్ని ఆచరించే హక్కును భారత రాజ్యాంగం తమకు కల్పించిందన్నారు. వక్ఫ్ సవరణలు ఇస్లామిక్ వ్యవస్థ యొక్క స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బిల్లును ఆమోదించవద్దని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్ఐ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఎర్రగొండపాలెం, మార్చి 28, (ఆంధ్రజ్యోతి) పశ్చిమ ప్రకాశం ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించే వెలిగొండప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి రాష్ట్రప్రభుత్వం రూ.2 వేలకోట్లు నిధులు ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్ నారాయణ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఎర్రగొండపాలెం సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రం అప్పుల పాలు అయ్యిందని పదేపదేసభలలో ప్రజలకు చెబుతున్నారన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు నిధులు ప్రకటిస్తేనేపూర్తి అవుతుందన్నారు. మొదటి విడతగా 2 వేల కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల బడ్జెట్‌లో రూ.309కోట్లు ప్రకటించారని ఆ నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు సరిపోవన్నారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 నాటికి పూర్తి చేసి కరువు ప్రాంతమైన పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలకు, సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. ఆ మేరకు సీపీఐ కౌన్సిల్ సమావేశంలో సీపీఐ నాయకులు తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం పంపుతున్నా మన్నారు. మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని అన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ నాయకులు కేవీ.కృష్ణగౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బి.రామయ్య, సీపీఐ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

మార్కాపురం వన్‌టౌన్ : ట్రూ అప్ సర్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్య అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ఎటువంటి చార్జీలు పెంచమన్నారు. అదానీ గ్రూప్‌తో చేసుకున్న సెకీ ఒప్పందాలు రద్దు చేసుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకించి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని సమర్థించటం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, రూబెన్, సురేష్, కాశయ్య, నన్నేసా, రాజు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే ఖదర్


విద్యుత్ దీపాలంకరణలో మస్జీద్

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): షబేఖదర్ పర్వదినాన్ని మార్కాపురం పట్టణంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జీద్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి 10 గంటలకు తరావి నమాజ్ చదివారు. జామీయా మస్జీద్‌లో ముఫ్తి మిన్హాజ్ మాట్లాడుతూ.. నెలరోజుల పవిత్ర ఉపవాస దీక్షలకు ప్రతిఫలం లభించే రోజు ఈదుల్ ఫితర్ అన్నారు. షబే ఖదర్ అత్యంత ముఖ్యమైన రోజు అని ఈరోజు యొక్క ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలన్నారు. రంజాన్ మాసం అల్లాహ్ ఆదేశాలను త్రికరణ శుద్ధిగా పాటించి ఆయన సమక్షంలో కృతజ్ఞతలు తెలియజేసే పర్వం అన్నారు. ప్రతి ఒక్కరూ పిత్రపరించాలని, సంపన్నులు జకాత్ ఇవ్వాలన్నారు. ఇస్లాంలో నిరాశ్రయులు, అనాథలను ఆదుకోవాలన్నారు. నిరుపేదలు కూడా సంతోషంగా రంజాన్ చేసుకునేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. పట్టణంలోని మక్కా, మదీనా, అరాఫత్, మినా తదితర మస్జీద్‌లలో భక్తి శ్రద్ధలతో షబే ఖదర్ పాటించారు. తెల్లవారుజాము వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జాగరం చేశారు.

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సర్వమతాల ఆత్మీయ ఇఫ్తార్ జమాతే ఇస్లాం హింద్ ఎస్ఐఓ, ఐఎంఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సర్వమతాల ఆత్మీయ విఫ్తార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ, వైద్యాధికారి రాహుల్, బాప్టిస్ట్ ఫీల్డ్ ప్రెసిడెంట్ సజీవరాజు, జామీయా మస్జీద్ ముతవల్లి సబ్దర్ అలీబేగ్, ఆయుర్వేద వైద్యులు నారాయణరెడ్డి, జేఐహెచ్ నాయకులు అష్రఫ్ అలీ, మాలిక్ బాష, సికిందర్, ఎంఎస్‌పీఎస్ నాయకుడు జాబీర్ హుస్సేన్ బేగ్, ఎస్ఐఓ అధ్యక్షుడు ఖాలీద్, ఎస్సీ ఎస్టీ, బీసీ నాయకుడు చింతగుంట్ల బాబు, మాలమహానాడు నాయకులు నాగయ్య పాల్గొన్నారు.

గిద్దలూరులో భానుడి భగభగ

● నిర్మానుష్యంగా మారిన వీధులు ● 40 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత


గిద్దలూరు పట్టణంలోని వీధి

గిద్దలూరుటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండ వేడికి జనం అల్లాడారు. 11 గంటలు దాటిన తరువాత ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. గిద్దలూరులో భానుడు భగభగమంటున్నాడు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. శుక్రవారం ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరింది. దీనితో రోడ్లన్నీ 11గంటల నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు బయటకు రాకుండా ఇళ్లకు పరిమితమవుతున్నారు. ఇళ్లలో ఉక్కపోతకు గురవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూలర్లకు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. పండ్లు, కూరగాయల వ్యాపారం చేసే చిరువ్యాపారులు ఎండ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పుచ్చకాయలకు, కరబుజ, చెరకు రసం, కొబ్బరి బోండాలు, జ్యూస్ లాంటి చల్లటి పానియాలకు గిరాకీ పెరిగింది.

నేడు వై.పాలెంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ 43వ అవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఉదయం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొంటారని తెలిపారు. పార్టీ ఆవిర్భావం సందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కావున మండలంలోని అన్ని గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని అన్నారు.

పీఏసీఎస్ కేంద్రంలో కందులు, మినుముల కొనుగోలు

● ఏవో బుజ్జిబాయ్

పెద్దారవీడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రంలో మినుములు, కందులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టు బాటు ధరలకు కొనుగోలు చేయనున్నట్లు ఏవో బుజ్జిబాయ్ అన్నారు. స్థానిక పీఏసీఎస్‌ను శుక్రవారం ఆమె సందర్శించి ఖరీఫ్, రబీలలో పండించిన కందులు, మినుములు కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు కందులు క్వింటాకు రూ.7550, మినుములు రూ.7400లు చెల్లించడం జరుగుతుందన్నారు. మద్దతు ధరలకు అమ్ముకునే రైతులు తమ గ్రామ పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి

పొదిలి, 28 ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీల బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కోరారు. సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని జువ్వలేరు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామి పనులను పరిశీలించారు.

ఉగాదికి ప్రత్యేక రైలు

గిద్దలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీశైలానికి కన్నడ భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని వెళ్లే నేపథ్యంలో గుంటూరు నుండి మార్కాపురం, గిద్దలూరు మీదుగా హుబ్లీ వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడిపేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 31వ తేదిన గుంటూరు-హుబ్లీ (07271) ప్రత్యేక రైలు గుంటూరులో రాత్రి 8గంటలకు బయలుదేరి గిద్దలూరుకు రాత్రి 10.53 గంటలకు వస్తుందన్నారు. మరుసటి రోజు ఉదయం 9.20 గంటలకు హుబ్లీ చేరుతుందని తెలిపారు. తిరిగి ఇదే రైలు ఏప్రిల్ 1న మధ్యాహ్నం 11గంటలకు హుబ్లీలో బయలుదేరి రాత్రి 8.50 గంటలకు గిద్దలూరు చేరి తెల్లవారుజామున 3 గంటలకు గుంటూరు వెళుతుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలులో 4 స్లీపర్ బోగీలు,14 జనరల్ బోగీలు, 2 బ్రేక్ వ్యాన్లతో మొత్తం 20 బోగీలతో నడుస్తుదన్నారు. భక్తులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి వసంత నవరాత్రులు

గిద్దలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులోని సీతారామస్వామి దేవాలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు వసంతనవరాత్రుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 30న సాయంత్రం 6 గంటలకు పంచాంగశ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ, 31వ తేదీ రాత్రి 7గంటలకు చిన్నారులకు భక్తిగీతాల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయుట, ఏప్రిల్ 1న రాత్రి 7గంటలకు భగవద్గీతలోని 15వ అధ్యాయం నందు మహిళలకు కంఠస్త పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు కన్సోలేషన్ బహుమతులు అందచేస్తామన్నారు. 2న బుధవారం రాత్రి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, 3న సాయంత్రం 4గంటలకు శ్రీరామాయణ కావ్యం నుండి పోటీ నిర్వహించి విజేతలకు నగదు బహుతులు అందజేస్తామన్నారు. 4వ తేది రాత్రి 7గంటలకు 15 ఏళ్ల పైబడిన మహిళలకు పాటల పోటీ ఉంటుందన్నారు. 5వ తేది రాత్రి 7గంటలకు భరతనాట్య ప్రదర్శన, 6వ తేది రాత్రి 7గంటలకు శ్రీసీతారామచంద్రమూర్తుల కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 7వ తేదీ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం కోలాట ప్రదర్శనతో గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వసంత నవరాత్రుల సందర్భంగా ఈవారంపాటు ప్రతిరోజు భగవద్గీత పారాయణం, స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు గాయత్రి యజ్ఞం

గిద్దలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీగాయత్రిదేవి ఆలయంలో ఈ నెల 29న శనివారం ఉదయం 9గంటలకు గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు గాయత్రి పరివార్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే గాయత్రి యజ్ఞంలో భక్తులు సామూహికంగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

బేస్తవారపేట, మార్చి28 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట గాంధీబజార్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఇక్కడికి మహిళలు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం విశేష పూజలతో ప్రత్యేకంగా ఆకట్టుకొంది. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలతో, వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు.

31 నుంచి శిక్షణ కార్యక్రమం

గిద్దలూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భువనగిరి వానప్రస్థ ఆశ్రమంలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు యువ నాయకత్వ శిక్షణ కార్యక్రమం, ఉద్యోగ అవకాశాల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుండి 35 ఏళ్లలోపు ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణను వినియోగించుకోవాలని, వివరాలకు 9160405397 ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

టీడీపీ నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ


మహబూబ్‌బాషాను పరామర్శిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులక్రితం గుండెపోటుకు గురై నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నంద్యాలకు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న టీడీపీ పార్లమెంటరీ నాయకులు షేక్ మహబూబ్‌బాషా (పెద్దబాషా)ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని, ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని పెద్దభాషాకు అశోక్‌రెడ్డి సూచించారు. వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: పీడీ

● ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక


నివేదికలను పరిశీలిస్తున్న పీడీ

త్రిపురాంతకం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోషఫ్ సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. 2023 - 2024 ఏడాదికిగాను మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి గత 10 రోజులుగా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల రికార్డులను అధికారులు పరిశీలించారు. మొత్తం సుమారు 20 కోట్ల రూపాయలకు పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. గణపవరంలో హార్టికల్చర్‌లో నాటిన మొక్కలు లేకపోవడంతో రికవరీ రాస్తున్నట్లు తెలిపారు. పలు గ్రామాలలో చేసిన పనులకు ఫీల్డ్ ఉన్న కొలతలకు స్వల్ప తేడాలు గుర్తించినట్లు డీఆర్పీలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీడీ నిర్మాలాదేవి, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఏపీవో సుజాత, ఎస్ఆర్పీ, డీఆర్పీలు పాల్గొన్నారు.

ముఖాముఖి

రూ.20 లక్షలతో దర్శి సుందరీకరణ

వై.మహేశ్వరరావు, కమిషనర్, దర్శి



ప్రశ్న: దర్శి నగర పంచాయతీ సుందరీకరణకు ఎంత ఖర్చు చేస్తున్నారు?
జవాబు: రూ.20 లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టాం.
ప్ర: నగర పంచాయతీ వార్షిక ఆదాయం ఎంత? ఏఏ పనులు చేశారు?
జ: దర్శి నగర పంచాయతీకి రూ.5 కోట్ల ఆదాయం వస్తుంది. ఈఏడాది ఇప్పటివరకు రూ.3.5 కోట్లు పన్నులు వసూళ్లు అయ్యాయి. పట్టణంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు ముమ్మరంగా చేపట్టాం.
ప్ర: దర్శి నగర పంచాయతీలో పోస్టుల భర్తీ ఎంతమేరకు జరిగింది ?
జ: కొత్త పోస్టులు మంజూరు కాలేదు. ప్రస్తుతం కమిషనర్, మేనేజర్, బిల్ కలెక్టర్ పోస్టుల్లో మాత్రమే తాము పనిచేస్తున్నాం. ఇతర ప్రాంతాల్లో పనిచేసే అధికారులు తాత్కాలికంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.
ప్ర: అక్రమ లేఅవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?
జ: 2019కి ముందు వేసిన లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 2019 తర్వాత వేసిన అక్రమ లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
ప్ర: అమృత పథకం ఏ దశలో ఉంది ?
జ: దర్శి నగర పంచాయతీలోని ప్రజలకు ఇంటింటికి కొళాయి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అమృత పథకం ద్వారా రూ.121 కోట్లను మూడేళ్ల క్రితం విడుదల చేసింది. గత ప్రభుత్వం టెండర్లు పిలిచింది కానీ పనులు ప్రారంభించలేదు. ప్రస్తుతం పాత టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మీ కోసంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. రేషన్ కార్డుదారులందరూ ఈనెల 31 లోగా ఈకేవైసీ చేయించుకొనే విధంగా చూడాలని వీఆర్వోలను ఆదేశించారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఇస్తున్న డేటాను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ 87శాతం పూర్తి

దొనకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియ 87 శాతం పూర్తయింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 12,724 రేషన్‌కార్డులకు గాను 44,651 మంది కార్డుల్లో కుటుంబసభ్యులుగా ఉన్నారు. ఇప్పటివరకు 38,900 మంది ఈకేవైసీ చేయించుకోవ టంతో 87శాతం పూర్తయినట్లు సమాచారం. ఈసందర్భంగా తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ రేషన్‌కార్డులోని సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోకుంటే రేషన్ పొందే అవకాశం కోల్పోవాల్సి ఉంటుంది. వలసలు వెళ్లినవారు ఆప్రాంతాల్లో రేషన్‌కార్డు నెంబరు చెప్పి ఈకేవైసీ చేయించుకునే అవకాశం ఉంది. మండలంలో వలసలు వెళ్లిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈనెల 31లోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

వైద్య అవసరాలకు సాయం

పామూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వివిధ రోగాలతో బాధపడుతున్న నలుగురికి వైద్యం కోసం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున శుక్రవారం రూ.ఐదు వేలు చొప్పున అందజేసినట్టు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మునలయ్య, టి.రమేష్ తెలిపారు. బాధితులు పబ్బతి రమేష్, షేక్ నాగూర్‌వలి, మదన్ జోషి, మానం వెంగయ్యకు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఎం.తిరుపతిరెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, బాషా మోహిద్దీన్, రంగారెడ్డి, కె.ప్రభాకర్, బాబురావు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలికి నివాళి

దర్శి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకురాలు తాండవ మంగమ్మ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నియోజకవర్గ నాయకుడు తాండవ రంగారావు, ఆమె తల్లి మంగమ్మ ప్రజలకు సేవలందిస్తున్నారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతిచెందింది. ఆమె మృతదేహం వద్ద పాపారావు నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో సీపీఎం నాయకులు జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, టీడీపీ నాయకులు యాదగిరి వాసు, నారపుశెట్టి మధు, సీపీఐ నాయకుడు మాడపాకుల రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పేరుకుపోయిన ఇంటి పన్నుల బకాయిలు

- పట్టనట్టుగా ప్రభుత్వ కార్యాలయాల అధికారులు
- పంచాయతీ అభివృద్ధికి నిధుల కొరత



దొనకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం

దొనకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలు ప్రభుత్వానికి చెల్లించే ఇంటి పన్నులు చెల్లించడంలో జాప్యం చేస్తే అధికారులు హడావుడి చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఆ నిబంధనలు వర్తించవనుకున్నారేమో లేదా పన్నులు చెల్లించకపోతే తమను ఎవరు ప్రశ్నిస్తారులే అనుకున్నారో ఏమో కానీ పన్నులు చెల్లించటం మానేశారు. తీరా ఆ బకాయిలు నేడు లక్షల రూపాయల్లో పేరుకుపోయాయి. గ్రామాల అభివృద్ధికి ఇంటి పన్నులే ప్రధాన ఆదాయ వనరులు. ఇంటి పన్నులు సకాలంలో వసూళ్లు జరిగితే పంచాయతీలో అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఇంటి పన్నులు నూరుశాతం వసూళ్లు చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు గ్రామ కార్యదర్శితో పాటు సచివాలయాల సిబ్బందికి సహితం ఆ బాధ్యతలను అప్పగించింది. మండల కేంద్రమైన దొనకొండ మేజర్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్నుల బకాయిలు అర కోటికి పైగానే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు చెందిన ఇంటిపన్నుల బకాయిలు దాదాపు రూ.22 లక్షలు ఉన్నాయి. గృహాలకు చెందిన పెండింగ్ బకాయిలు దాదాపుగా రూ.30 లక్షలు పేరుకుపోయాయి. విద్యుత్‌శాఖ రూ.3,58,044, తహసీల్దార్ కార్యాలయం రూ.2,35,936, సివిల్ సప్లయ్ గోడౌన్లు రూ.4,17,629, కేజీబీవీ పాఠశాల రూ.1,20,732, వెలుగుశాఖ రూ.95,428 బకాయి ఉంది. అలాగే, ఎస్సీ బాలుర హాస్టల్ రూ.1,03,863, బీసీ బాలుర హాస్టల్ రూ.25,872, గృహ నిర్మాణశాఖ రూ.53,105, పశువైద్యశాల రూ.58,587, ఎస్సీ బాలుర హాస్టల్-2 రూ.1,07,035 చెల్లించాల్సి ఉంది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రూ.1,10,415, రిలయన్స్ టవర్ రూ.38,127, యూటీఎఫ్ ఆఫీస్ రూ.20,281, మల్లెల సుబ్బరాయుడు బిల్డింగ్స్ రూ.95,327, పోలీస్‌స్టేషన్ రూ.1,62,073, ఆర్‌అండ్‌బీ ఆఫీస్ రూ.42,453, బీఎస్ఎన్ఎల్ టవర్ రూ.48,661మేర బకాయిలు పేరుకుపోయాయి.

గత వైసీపీ ప్రభుత్వం ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో భారీగా బకాయిలు పెరిగిపోయినట్లు సమాచారం. దీంతో దొనకొండ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో, పారిశుధ్యం తరలించే ట్రైసైకిళ్లు, తడి, పొడి చెత్త వాహనం మరమ్మతులకు గురై మూలనపడటం, ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగకపోవటంను ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం వీటి వసూళ్లు పంచాయతీ సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- శాస్త్రవేత్త డాక్టర్ పి.రాజమణి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రాజమణి

దర్శి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.రాజమణి సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం, నాగపూర్ సౌజన్యంతో గిరిజన రైతులకు పత్తి పంటపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట సాగులో ఎకరాకు 20కి పైగా పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోన్నట్లయితే పురుగులను నివారించ వచ్చునని చెప్పారు. పూత, పిందె దశలో ఆశించే గులాబి రంగు పురుగులను నివారించేందుకు పిరమూన్ ప్రూఫ్ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పత్తిపంట చుట్టూ కంచె గా మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసుకోవాలని వివరించారు. విచక్షణ రహితంగా పురుగు మందులు వాడటం వల్ల రైతులకు పెట్టుబడులు ఖర్చు పెరగటం తప్ప ప్రయోజనం ఉండదన్నారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించి లాభాల బాటలో ముందుకు సాగాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు డాక్టర్ జి.రమేష్, డాక్టర్ ఎల్.రాజేష్ చౌదరి, డాక్టర్ టి.వెంకటేశ్వర రెడ్డి, దోర్నాల ప్రాంతానికి చెందిన గిరిజన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు

కనిగిరి క్రీడాకారిణుల ఎంపిక



శివనాగలక్ష్మి



పావని



హైమావతి



దివ్యశ్రీ

కనిగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 57వ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు కనిగిరికి చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా ఖోఖో సంఘం కార్యదర్శి బి.కాశివిశ్వనాథరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 31నుంచి వచేనెల 4వ వరకు ఒరిస్సాలోని పూరీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర మహిళా జట్టుకు కనిగిరి ఖోఖో అకాడమీకి చెందిన ఈ.హైమావతి, ఎం.దివ్యశ్రీ, డి.శివనాగలక్ష్మి, ఎస్. పావని ఎంపికయ్యారు. ఈనెల 16న ఉమ్మడి ప్రకాశం జిల్లా పంగులూరులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా జట్టు ఎంపిక పోటీలో వీరు పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. గత వారం రోజుల నుంచి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరుగుతున్న శిక్షణలో వీరు పాల్గొన్నారు. వీరిలో డి.శివనాగలక్ష్మి, ఎస్‌పావని కనిగిరిలోని ఎంఎస్‌ఎం విద్యార్థులుకాగా, మరో ఇద్దరు పొదిలిలోని వివేకానంద కళాశాలలో బీపీఈడీ చదువుతున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను రాష్ట్ర ఖోఖో సంఘం చీఫ్ ప్యాట్రన్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్‌రావు, బి.కాశీవిశ్వనాథరెడ్డి, కోశాధికారి కె.హనుమంతరావు, ఎంఎస్‌ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు అభినందించారు.

ప్రమాదకరంగా ఈత సరదా



మేజర్ కాలువలో ఈత కొడుతున్న విద్యార్థులు

దర్శి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ఈత సరదా ప్రమాదకరంగా మారింది. ఇటీవల కాలంలో అనేకమంది యువకులు, విద్యార్థులు ఈతకు వెళ్లి మృతిచెందారు. విద్యార్థులకు అవగాహన లేక నీరు కనిపించగానే ఈతకు దిగుతున్నారు. దర్శి పక్కనే సాగర్ కాలువ ఉండ టంతో ఈతకు వెళ్తున్నారు. చెరువుల్లో కూడా ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఒంగోలు బ్రాంచ్ కాలువలో ముగ్గురు యువకులు గల్లంతయి మృతి చెందిన విషయం తెలిసిందే. ఎన్ఏపీ చెరువులో ఇద్దరు, తూర్పువీరాయపాలెం వాగులో ఇద్దరు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి.

తాజాగా పది రోజుల క్రితం కురిచేడులో చెరువు లో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. విద్యార్థులు ఆటవిడుపుగా వెళ్లి కాలువలు, మేజర్లు, చెరువుల్లో ఈతకొట్టడం పరిపాటైంది. తల్లిదండ్రులు పిల్లలకు జాగ్రత్తలు చెప్పకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న ఆటో సీజ్

కనిగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను శుక్రవారం పోలీసులు సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. ఎస్ఐ టి.శ్రీరాం పొదిలి రోడ్డులోని పొగాకు బోర్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కనిగిరి నుంచి పొదిలి వైపునకు 20 మంది ప్రయాణికులతో ఆటో వెళుతుంది. ఆటోను ఎస్ఐ సీజ్ చేసి ప్రయాణికులను మరో ఆటోల్లో తరలించారు. ఆటో డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవడంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీరాం మాట్లాడుతూ ఎవరైనా పరిమితికి మించి ఆటోల్లో కూలీలను ఎక్కించుకుని వెళ్తే వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయటంతో పాటు ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రేషన్ కార్డుల్లో కోత తగదు!

కనిగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ పేరుతో రేషన్ కార్డుల్లో కోత వేసేందుకు ప్రభుత్వం తీసుకున్న విధానం తగదని సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోగా, ఉన్నవాటిని కుదించేందుకు ఈకేవైసీ చేయటం సరికాదన్నారు. ఈ విధానంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈనెల 31లోగా రేషన్ డీలర్ల వద్ద లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని విధించిన విధానాన్ని మూడు నెలలు పొడిగించాలని డిమాండ్ చేశారు. సచివాలయాల్లో, తహసీల్దార్ కార్యాలయాల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి మంజూరుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సాయిసేవా బృందం సహకారం మరువలేనిది

కనిగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సాయిసేవా బృందం అందించిన సహకారం మరువలేనిదని సాయిబాబా దేవస్థాన కమిటీ మాజీ అధ్యక్షుడు దేవకి సుబ్రమణ్యం అన్నారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో శుక్రవారం దేవకి సుబ్రమణ్యం దంపతులను సాయిసేవా బృందం ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ బాబా ఆలయ పునర్నిర్మాణానికి, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించిన పట్టణ ప్రజలకు, భక్తులకు, సాయిసేవా మహిళా బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి కూడా ఇదే మాదిరిగా సహకారాన్ని అందించి బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ప్రధాన కార్యదర్శి పెన్నా వెంకటేశ్వర్లు, బోయిళ్ల తిరుపతిరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, నూతన అధ్యక్ష, కార్యదర్శులు కొప్పరపు సత్యాలు, బాలు ఓబులురెడ్డి, ముచ్చర్ల ధర్మారావు, కనిగిరి మాజీ సర్పంచ్ దేవకి లలితకుమారి, కొలిపర్తి మారుతి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, వీసీ రామశాస్త్రి, శింగరాజు మాలకొండేశ్వరరావు, సాయిరాం, ఉమాకాంత్, పల్లా మాలకొండ రాయుడు, గంగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శ్రీరాం మురళి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయాలి

ముండ్లమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి గ్రామ సంఘం అధ్యక్షురాళ్ళు, వీవోఏలు కృషి చేయాలని వెలుగు దర్శి కస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఉన్న పొదుపు సంఘాలన్నింటినీ బలోపేతం చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి సంఘానికి రూ.ఐదు లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. స్త్రీ శక్తి, బ్యాంక్ లింకేజీ, సీఐఎఫ్ రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎం.హనుమంతరావు, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకాయమ్మ, సీసీలు కోటేశ్వరరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

దొనకొండ, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు. మండలంలోని పెద్దన్నపాలెం గ్రామం చెరువు కట్టపై వెలసిన శ్రీకృష్ణుడి దేవాలయంలో జనవరి 6న దొంగతనం జరిగింది. దేవాలయం ధర్మకర్త సుబ్బారావు పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన సిద్దాబత్తుల రామసాయి, పల్నాడు జిల్లా గుమ్మనంపాడు గ్రామానికి చెందిన నక్కా వెంకటలక్ష్మణరావును అనుమానించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వారినుంచి రూ.18వేలు విలువ కల్గిన టీవీ, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకొని దర్శి కోర్టులో హాజరుపర్చినట్టు చెప్పారు. మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

రేపు వెంకట్రామయ్య స్వామి తిరునాళ్ల

తాళ్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో అవతరించిన అవదూత వెంకట్రామయ్య స్వామి తిరునాళ్ల ఆదివారం జరుగుతుంది. ఇందుకుసంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకట్రామయ్యను స్వామిగా ప్రజలు ఆరాధిస్తూ ఆయన సమాధిపై శివాలయాన్ని నిర్మించి ప్రతి ఏటా ఉగాది పండుగ రోజు తిరునాళ్ల నిర్వహిస్తున్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కనిగిరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సర్ చార్జీలు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు కేశవరావు మాట్లాడుతూ ట్రూఅప్, సర్ చార్జీలంటూ ప్రజలపై భారాలు మోపారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించటంతో పాటు చార్జీలు పెంచమని ఎన్నికలకు ముందు ప్రచారంలో హామీలు గుప్పించారన్నారు. కానీ నేడు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల్ని మోసగించారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసన్న, నరేంద్ర, ఏడుకొండలు, పిచ్చయ్య, వెంకటమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు చందలూరు విద్యార్థి ఎంపిక



ప్రేమ్‌కుమార్

దర్శి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మాగులూరి ప్రేమ్‌కుమార్ జాతీయస్థాయి త్రోబాల్ జూనియర్స్ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన ప్రేమ్‌కుమార్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 29 నుంచి 31 వరకు పాండిచేరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ప్రేమ్‌కుమార్ పాల్గొంటున్నారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జి గురుప్రసాద్, పీడీ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.

ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమానికి విశేష స్పందన

దర్శి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 4వ వార్డులో శుక్రవారం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూతో పాటు ఇతర సమస్యలు కూడా ప్రజలు తమ దృష్టికి తెస్తున్నారన్నారు. అన్నీ సమస్యలను సేకరించి ఆయా శాఖల అధికారులకు పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిటాల శ్రీనివాసరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ జి.స్టీవెన్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

పీసీపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగే సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఏప్రిల్ 2న జరగనున్న రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ భూమిపూజకు సంబంధించి చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి మండలంలోని నాయకులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

పీసీపల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మండలంలో జరుగుతున్న సర్వే వివరాలను ఎంపీడీవో ప్రభాకరశర్మను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీచేశారు. ఈసందర్భంగా సీఈవోను ఎంపీడీవో ప్రభాకరశర్మ, కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

పామూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సెకీతో చేసుకొన్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. అదానితో రాష్ట్ర ప్రభుత్వ చేసుకొన్న అన్నిరకాల విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని కోరుతూ సీపీఎం శ్రేణులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల మీద ట్రూ అప్ చార్జీలు పెంచి రూ.12 వేల కోట్ల భారాలు మోపిందని అన్నారు. అదానితో 20 సంవత్సరాల పాటు ఒప్పందం చేసుకొందన్నారు. వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తుందని ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ ఖాశింసాహెబ్, కె.శంకర్, వై.వీరనారాయణ, ఎస్డీ గౌస్‌బాషా, షేక్ గులాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు ఈద్గా ముస్తాబు

పామూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పండుగను పురష్కరించుకొని ఈద్గాలో నమాజ్‌ల కోసం శుక్రవారం మైదానంలో వివిధ పనులు చేపట్టారు. సోమవారం జరిగే రంజాన్ పండుగకు ముందస్తుగా ఈద్గా మైదానంలో మొలచి ఉన్న పిచ్చి, చిల్ల మొక్కలను తొలగించి భూమి చదును కార్యక్రమం చేపట్టారు. సుమారు ఐదువేల మంది ముస్లింలు ఈద్గా మైదానంలో సామూహికంగా ప్రార్థనలు చేసుకొనే విదంగా మైదానాన్ని ముస్తాబు చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లీం మైనార్టి సెల్ కమిటీ సభ్యులు షేక్ ఖాజారహంతుల్లా, ఆర్ఆర్ రఫి, షేక్ గౌస్‌బాషా, ముబినా మౌలాలి, షేక్ హజిగౌస్, మాచర్ల రహిమాన్, షేక్ సుభాని, హజిమలాన్, పత్తు మస్తాన్, వై .అస్లీం, హజిమస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా బాలికల హాస్టల్ నిర్మాణం

పామూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల హాస్టల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్వశిక్ష కింద రూ. ఒక కోటి 94 లక్షలు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మంజూరు చేయించారు. హాస్టల్ నిర్మాణం కోసం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆవరణలో పాటుపడి ఉన్న భవనాలను తొలగించారు. ఆస్థలంలో గత నెల 17న భూమి పూజ చేశారు. ప్రస్తుతం పునాదుల పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతోపాటు ఇంటర్ విద్యార్థినులు కూడా ఉండేందుకు ఈ వసతి గృహంలో అవకాశాలు కల్పించనున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఈ హాస్టల్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

పామూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జాలా అంజయ్య ఆరోపించారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డులను ఆధార్ లింకుతో తొలగించడం, రైతుకు అనుసంధానం చేయడం, నిధుల్లో కోత తగదన్నారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి వై.వీరనారాయణ, పి.రామయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, వై .జయరావు, కె.మాల్యాద్రి పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షల 13వేలు


సీఎస్‌పురం(పామూరు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి హుండీ కానుకలను భైరవకోన దేవస్థాన ఈవో డి.వంశీకృష్ణ, అలయ ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో శుక్రవారం లెక్కించారు. 30 రోజులకు హుండీల ద్వారా రూ.2,13,456 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

తాళ్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పక చేయించాలని ఏడీఏ కె.బాలాజీ నాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రైతు సేవా కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎరువులు విచక్షణారహితంగా వాడకుండా ఎంత అవసరమో భూసారపరీక్షల ద్వారా స్పష్టంగా తెలుసుకొని వాడితే సరిపోతుందన్నారు. సూక్ష్మ, స్థూల పోషకాలు ప్రతి పంటకు అవసరమవుతాయన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకొకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, వీఏఏ వెంకటసుమ, ఐసీఆర్పీలు రమేష్ , కోటిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

తాళ్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలాపురం గ్రామంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు విచారణకు ఆదేశించారు. గ్రామంలో 2021 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు విడుదలైన గ్రామ పంచాయతీ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టకుండా దుర్వినియోగం చేశారని గ్రామానికి చెందిన నవులూరి విద్యాసాగర్ ఇటీవల జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని డీపీవోను కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు విచారించి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని ఎంపీడీవోను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



రేపల్లె మున్సిపల్ హైస్కూల్లో పనిచేయని ఆర్‌వోప్లాంటు

బెల్ సరే.. మరి నీళ్లెలా?

విద్యార్థులకు అందని శుద్ధ జలం

- బాపట్ల మండలం మరుప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్ పనిచేయక పోవడంతో ఉపాధ్యాయులు క్యాన్ వాటర్ కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నారు పిట్టలవానిపాలెం మండలం చందోలు హైస్కూల్, భవనవారిపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్లు పనిచేయడంలేదు.
- రేపల్లెలోని పాతపట్నంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, 2వవార్డులోని గురుకుల పాఠశాలలో, ఓపెన్ థియేటర్‌లోని పాఠశాల, ఆంధ్రరత్న పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి.
- వేమూరు నియోజకవర్గ పరిధిలోని 73 పాఠశాలల్లో నాడు-నేడు మొదటి దశలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని ప్రారంభం నుంచే మరమ్మతులకు గురై పని చేయడంలేదు. కొంత కాలం తర్వాత మరో 42 ప్లాంట్లు మరమ్మతులతో నిరుప యోగంగా మారాయి.
- అద్దంకి నియోజకవర్గంలో గతంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లలో 90 శాతానికి పైగా మూలనపడ్డాయి. తాజాగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో మరమ్మతులు ప్రారంభించారు.



వేమూరు హైస్కూల్‌లో పని చేయని ఆర్వో ప్లాంటు

ఎండలు మండుతున్నాయి.. ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. అయినా విద్యార్థులు ఎండ వేడికి అల్లాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో 'వాటర్ బెల్' అమలు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించింది. వేసవి తాపానికి గురికాకుండా విద్యార్థులకు గంటకో సారి మంచినీరు తాగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆదేశించింది. అయితే వాటర్ బెల్ కొట్టినా విద్యార్థులకు శుద్ధ జలం ఎలా అందించాలో తెలియక ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వందల్లో విద్యా ర్థులు ఉన్నా శుద్ధ జలం అందుబాటులో లేదం టే ఆశ్చర్యం కాదు. ఇక గత వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినా నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి. చాలాదగ్గర్ల వాటిని ఇప్పటికీ బిగించలేదు. ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరమ్మతులతో మూలకు చేరాయి. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి లేదంటే పాఠశాల సమీపంలోనే నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు.

- పాఠశాలల్లో అలంకార ప్రాయంగా ఆర్వో ప్లాంట్లు
- రూ.లక్షలతో ఏర్పాటు.. నిర్వహణ లేక నిరుపయోగం
- కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ యంత్రాలను బిగించని వైనం
- మరమ్మతులపై ఫిర్యాదులను పట్టించుకోని ఏజన్సీలు

(ఆంధ్రజ్యోతి - బాపట్ల న్యూస్‌నెట్‌వర్క్)

ఎండలతో పాటు వాతావరణంలో వేడి రోజు రోజుకు తీవ్రమవుతోంది. దీంతో పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా గంటగంటకు నీరు తాగేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. ఇళ్ల నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు అన్న పరిస్థితి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకంలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే అవి మూణ్ణాళ్ల ముచ్చటగానే పని చేశాయి. ఏర్పాటు చేసిన కొన్ని రోజులకే ఆర్వో ప్లాంట్లు మూలనపడ్డాయి. వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే లేరు. అటు ఇటు అధికారులు, ఇటు సంబంధిత ఏజన్సీల వారు ఆర్వో ప్లాంట్ల గురించి పట్టించుకోవడంలేదు.

దీంతో పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా లేక మూతపడ్డాయి. ఈ పరిస్థితుల్లో పాఠశాలల్లో దొరికే నీరు శుభ్రంగా లేకపోవడంతో (మిగతా 4వ పేజీలో)

ఆంధ్రజ్యోతి ఫోకస్

నిర్వహణ.. నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని చాలాదగ్గర్ల బిగించలేదు. బిగించిన దగ్గర్ల మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారేలేరు. ఏర్పాటుతో సరిపెట్టిన కంపెనీల ప్రతినిధులు నిర్వహణ మరిచారు. ప్రధానోపాధ్యాయులు మరమ్మతుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించినా ప్లాంట్ల గురించి పట్టించుకునే వారే లేరు. ప్లాంట్‌లు బిగించిన వారికి ఫోన్ చేస్తే మొక్కుబడిగా మరమ్మతులు చేసి వెళ్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపడంలేదు. దీంతో ఆర్వో ప్లాంట్లు ఆయా పాఠశాలలో మూలనపడి నిరుపయోగంగా ఉన్నాయి. స్కూల్ గ్రాంట్‌తో మరమ్మతులకు ప్రధానోపాధ్యాయులు సిద్ధమైనా ఆర్వోప్లాంట్ విడి పరికరాలు ఎక్కడా దొరడంలేదు. దీంతో ప్లాంట్‌ను పాఠశాలకు పంపిణీచేసిన ఏజన్సీ వారు వస్తే తప్ప వాటి మనుగడ కొనసాగలేని పరిస్థితి.

బిల్లులు.. బాధలు

- అప్పుల భారంతో కాంట్రాక్టర్లు సతమతం
- గతంలోనూ ఇప్పుడూ ఒకే తీరుగా అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.800 కోట్ల బకాయిలు
- బ్యాంకు ఖాతాలకు మార్చి 31 డెడ్‌లైన్.. ఆలోగా చెల్లించకపోతే ఎన్‌పీఏ

గుంటూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో కాంట్రాక్టులు చేసిన నేరానికి చిన్నా చితక కాంట్రాక్టర్ల జీవితాలు చిన్నాభిన్నమైపోతున్నాయి. గత ప్రభుత్వం చేసిన పాపాలను కడిగేస్తున్న కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి (ఎంఎస్‌ఎంఈ) కేటగిరి కాంట్రాక్టర్లు సుమారు 450 మంది గత ప్రభుత్వ హయాంలో వివిధ శాఖలకు సంబంధించి కాంట్రాక్టులు చేశారు. గుంటూరు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ సహా జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో కాంట్రాక్టులు చేసిన వీరికి గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో చేసిన పనలకు సంబంధించి రూ.150- 200 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు సంబంధించి రూ.50-70 కోట్లు, గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్లూఎస్) విభాగంలో రూ.100- 150 కోట్లు బకాయిలు ఉన్నాయి. పంచాయతీరాజ్ పరిధిలో చేసిన పనులకు రూ.70 కోట్ల వరకు బకాయిలు ఉండగా, ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పనులకు సంబంధించి రూ.10 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇవే కాకుండా కొవిడ్ సమయంలో ఆర్ అండ్ బీ పరిధిలో పలు చోట్ల పీహెచ్‌సీల నిర్మాణం, పాత వాటి ఆధునికీకరణలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.160 కోట్లు ఉండగా, ఒక్క గుంటూరు జిల్లాలోనే రూ.35 కోట్ల బకాయిలు ఉన్నాయి.

నిధులివ్వని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నిధులు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఒకవేళ ఇచ్చినా మొత్తం కాంట్రాక్టు ఖర్చులో 15 శాతానికి మించి ఇవ్వలేదని చెబుతున్నారు. అది కూడా సీరియల్ ప్రకారం కాకుండా అయిన వారికే ఇచ్చుకున్నారని వాపోతున్నారు. గత ప్రభు త్వం తెరమీదకు తెచ్చిన ఈ అడ్డదారినే ఈ ప్రభు త్వంలో కూడా అధికారులు కొనసాగిస్తున్నారని, దీంతో సామాన్య కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని తెలిపారు. సీరియల్‌ప్రకారం కాంట్రాక్టర్ల బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

బ్యాంకుల నుంచి నోటీసులు

కాంట్రాక్టర్లు అనేక మంది బ్యాంకుల వద్ద ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో అప్పులు చేస్తారు. వాటికి ఏ ఏడాదికా ఏడాది వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఎవరూ వడ్డీలు చెల్లించలేదు. మరో మూడు రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం కూడా ముగుస్తుండడంతో వడ్డీలు చెల్లించని కాంట్రాక్టర్ల కు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. మూడు రోజుల్లోపు వడ్డీలు చెల్లించకపోతే సదరు ఖాతాలను నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పీఏ) జాబితాలోకి చేరుస్తామని నోటీసుల్లో హెచ్చరించాయి. ఒకసారి ఖాతా ఎన్‌పీఏ పరిధిలో పెడితే సంబంధిత కాంట్రాక్టరు స్థిర, చర ఆస్తులు వేలానికి వెళతాయని, ఆ ప్రమాదం నుంచి కాపాడమని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు.

న్యాయం చేయాలి

ఎంఎస్‌ఎంఈ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి. చిన్న, సన్నకారు కాంట్రాక్టర్లు బిల్లులు రాక అప్పులపాలయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అనేక మంది పరిస్థితి అలానే ఉంది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. సీరియల్ ప్రకారం అందరికీ బకాయిలు చెల్లించాలి. - ఎస్.విజయ్‌కుమార్, సబ్కా రాష్ట్ర అధ్యక్షుడు



వరించిన పదవులు

- 3 జిల్లాలు.. ఐదుగురికి అవకాశం
- మార్కెట్ కమిటీలకు చైర్మన్ల నియామకం
- మిగతా ఏఎంసీలకు ఉగాదికి నియమించే అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉగాదిలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా.. ఆయా పదవులు ఎవరిని వరిస్తాయోనని నేతలు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పలు మార్కెట్‌యార్డు చైర్మన్ పదవులను ప్రకటించారు. ఇందులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఐదు మార్కెట్ యార్డులు ఉండగా ఐదుగురిని ఏఎంసీ చైర్మన్ పదవులు వరించాయి. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా యార్డులకు సంబంధించిన డైరెక్టర్లను త్వరలో నియమించనున్నారు. కాగా శుక్రవారం ప్రకటించిన చైర్మన్ పదవుల నియామకంపై స్థానిక కేడర్‌లో హర్షం వ్యక్తమవుతోంది. పార్టీ కోసం అహరహం శ్రమించిన వారికే పదవులు కట్టబెట్టారని కొనియాడుతున్నారు.

ఆశావహుల ఎదురుచూపు..

మార్కెట్ పాలక వర్గాలకు సంబంధించి మరికొందరికి డైరెక్టర్ పదవులు దక్కనున్నాయి. యార్డులకు సంబంధించి ఇప్పటికే రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో చైర్మన్, వైస్‌చైర్మన్, డెరెక్టర్ల పదవులకు పేర్లను ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. అయితే మరో రెండు, మూడు రోజుల్లో భారీ సంఖ్యలో పదవుల పందేరం జరిగే అవకాశం ఉండటంతో ఆశావహులు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు మార్కెట్(మిర్చి) యార్డు, దుగ్గిరాల మార్కెట్(పసుపు) యార్డు చైర్మన్ పదవులు అత్యంత కీలకమైనవి. గుంటూరు మార్కెట్ యార్డు ఆసియాలోకే పేరొందింది. దీన్ని జనరల్‌కు కేటాయించినట్లు సమాచారం. ఈ పదవి కోసం అనేక మంది సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న దుగ్గిరాల మార్కెట్ యార్డు పదవికి కూడా చాలామంది పోటీ పడుతున్నారు. ఈ యార్డును ఎస్సీలకు రిజర్వ్ చేసినట్లుగా సమాచారం. ఈ చైర్మన్ల నియామకం ఉగాదికి ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.



బాపట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి | అద్దంకి అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మావతి | పి. శ్రీనివాసరావు | జవ్వాది కిరణ్‌చంద్ | ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన శోభారాణి

- జిల్లా కేంద్రమైన నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి టీడీపీ సీనియర్ నేత, పమిడిపాడుకు చెందిన పూనాటి శ్రీనివాసరావును వరించింది.
- సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కోమటినేని శోభారాణికి దక్కింది. సత్తెనపల్లి ఏఎంసీ చరిత్రలో తొలి మహిళా చైర్మన్ కావడం గమనార్హం. సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన గ్రామానికి చెందిన శోభారాణి తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు సతీమణి. 2013లో ఆమె ఎంపీటీసీగా పోటీ చేసి ఓటమి చెందారు.
- మంగళగిరి యార్డు చైర్మన్‌గా జవ్వాది కిరణ్ చంద్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఆయన విద్యార్థి దశ నుంచే టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నారు. పెదవడ్లపూడికి చెందిన కిరణ్ కుటుంబీకులంతా మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు.
- బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కావూరి శ్రీనివాసరెడ్డి ని వరించింది. ఆర్మీలో పనిచేసిన ఆయన 2014లో రాజకీయాలపై ఆసక్తితో టీడీపీలో చేరారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. గత ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పార్టీ విజయం కోసం శ్రమించారు.
- అద్దంకి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా వరగాణి పద్మావతిని పదవి వరించింది.

కమిషనరేట్‌కు వెళ్లిన ఈఎస్ దేవదత్తు?

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్నందుకు సరెండర్ నోటీసులు అందుకున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు శుక్రవారం ఎక్సైజ్ కమిషనరేట్ బాట పట్టినట్లు సమాచారం. కలెక్టర్ సరెండర్ ఆదేశాలు ఇచ్చినా వాటిని ఆయన ఖాతరు చేయకపోవడంపై చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై వివరణ ఇచ్చుకునే క్రమంలో ఎక్సైజ్ ఉన్నతాధికారులను ఈఎస్ దేవదత్తు కలిసినట్లు తెలుస్తోంది. కలెకర్ వెంకటమురళి ఇచ్చిన సరెండర్ ఉత్తర్వులలో కూడా కమిషనరేట్‌లో రిపోర్టు చేయమని ఉంది. సరెండర్ ఆదేశాలనే కమిషనరేట్ కొనసాగిస్తుందా లేక మరేదైనా నిర్ణయం ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే ఏఈఎస్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండడంతో రాష్ట్ర స్థాయిలో కమిషనరేట్ తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

బాపట్ల - చీరాల మధ్య.. టూరిజం సర్క్యూట్

- బ్లూఫ్లాగ్ బీచ్‌గా సూర్యలంక
- అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకకేంద్రం
- పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ప్రమాణాలతో సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బాపట్ల మండలం అడవిపల్లెపాలెం వీ రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన వాటర్‌పార్క్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బ్లూఫాగ్‌బీచ్‌గా సూర్యలంక బీచ్‌ను తీర్చిదిద్దుతామన్నారు. పర్యాటకుల భద్రత, అంతర్జాతీయప్రమాణాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. బాపట్ల-చీరాల మధ్యలో టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 ద్వారా మంజూరైన 97.52 కోట్ల రూపాయల నిధులతో సూర్యలంకబీచ్‌లో అధునాతన సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే పీపీపీ విధానంలో పెట్టుబడులకు పలువురు ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలికామన్నారు. పీపీపీ విధానంలో వీ రిసార్ట్స్ ఏర్పాటు చేయటం సంతోషదాయకమన్నారు.

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటకరంగం అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందుకు నిదర్శనంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సూర్యలంకబీచ్‌కు 97కోట్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ నిధులతో సూర్యలంకబీచ్‌లో పర్యావరణ విద్య, పరిశుభ్రత, టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదులు, వ్యర్థాల నిర్వాహణకు విధానం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే పర్యాటకానికి పెద్దపీట వేస్తామన్నారు. తద్వారా బాపట్ల-చీరాల నియోజకవర్గాలలో భారీఎత్తున ఉపాధి కల్పించనున్నామన్నారు. పర్యాటక రంగానికి ఈ ప్రాంతాలు ఉపయోగపడేవని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో బాపట్ల,చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండలు తెలిపినట్లు చెప్పారు. వాళ్ళుఅడిగిన 15రోజుల్లోనే సూర్యలంకబీచ్ అభివృద్ధికి భారీఎత్తున నిధులు రావటం జరిగిందన్నారు. ఇందుకు కేంద్ర,గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇతోధికంగా కృషి చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం. కొండయ్య, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటి చైర్మన్ రాజశేఖరబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, జనసేన సీనియర్ నాయకులు అమంచి స్వాములు, వెంకటశివన్నారాయణ, వీ రిసార్ట్స్ అధినేత సందీప్, భాస్కర్ పాల్గొన్నారు.



వి రిసార్ట్స్‌లో వాటర్ పార్క్‌ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు

సీఎం పర్యటన ఏర్పాట్లు వేగవంతం

- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో 1న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో సమీక్షించారు. శనివారం సాయంత్రంలోగా హెలీప్యాడ్ పనులు పూర్తి చేయాలన్నారు. ప్రజా వేదిక ప్రాంగణాన్ని రెండు వేల మంది కూర్చొనేలా సిద్ధం చేయాలని చెప్పారు. సభా ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక కొరత రాకుండా చర్యలు

రాబోయే వర్షాకాలంలో ఇసుకకు కొరత రాకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గాజులంక-1, జువ్వలపాలెం రీచ్‌లకు అనుమతులు ముగిసినందున వాటి రెన్యువల్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ఓలేరు రీచ్‌లో 74 వేల టన్నులు, గాజులంక-2 బీచ్‌లో 40 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఓలేరు రీచ్‌లో ఇసుక తవ్వకాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుకను జిల్లా అవసరాలకు మాత్రమే వాడుకోవాలని ఇతర జిల్లాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, మైన్స్ ఏడీ రాజేష్‌బాబు, జిల్లా రవాణాధికారి పరంధామరెడ్డి, డీపీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్సీ అనంతరాజు, ఆర్డీవో రాజ్యలక్ష్మిపాల్గొన్నారు.



క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

90 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- స్వర్ణ నుంచి చిలకలూరిపేటకు తరలింపు.. ముగ్గురిపై కేసు

పర్చూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు అధికారుల బృందం శుక్రవారం వేకువజామున పర్చూరులో వాహనాల తనిఖీలు చేపట్టింది. ఈ సమయంలో కారంచేడు మండలం స్వర్ణ గ్రామం నుంచి చిలకలూరిపేటకు వెళ్తున్న మినీ లారీని తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలోని వారిని విచారించగా స్వర్ణ నుంచి బియ్యాన్ని చిలకలూరిపేటకు తరలిస్తున్నట్లు చెప్పారు. వాహన యజమాని కోటేశ్వరరావు, డ్రైవర్ కోటేశ్వరరావుతో పాటు బియ్యం తరలిస్తున్న జి.రాజేష్‌లపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. తనిఖీల్లో సివిల్ సప్లై అధికారులు సుధీర్‌కుమార్, కిషోర్, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పర్చూరులో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్



సీఎం పర్యటన కోసం సిద్ధం చేస్తున్న ప్రాంగణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

సీఎం పర్యటన పనుల్లో తెలుగు తమ్ముళ్లు

ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

చినగంజాం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు ఏప్రిల్ ఒకటిన చినగంజాం మండలం, పెద్దగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి, కొత్తగొల్లపాలెంలో పేదల సేవ పెన్షన్ పంపిణీలో పాల్గొనేందుకు వస్తున్న తరుణంలో ఏర్పాట్ల కార్యక్రమంలో తెలుగుతమ్ముళ్లు నిమగ్నమయ్యారు. అధికారులతో కలసి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. సీఎం పర్యటన సందర్భంగా గ్రామాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలోని ప్రజలకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలతో ఇటు అధికారులతో పాటు, పార్టీ శ్రేణులు అలుపెరగని విధంగా కార్యక్రమాలు నిర్వహణలో భాగస్వాములు అయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు పొదవీరయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డిల నేతృత్వంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హెలిప్యాడ్, ప్రజావేదిక ప్రాంగణ పనులను పర్యవేక్షించారు. అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ప్రజల సమస్యలను ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్నారు.

విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టి సారించాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న న్యాయాధికారి సుధ, డా.బాబూరావు, ప్రిన్సిపాల్ నాగమణి

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో చెడు మార్గాలకు దూరంగా ఉండి ఉన్నత భవిష్యత్‌పై దృష్టి సారించాలని న్యాయాధికారి సుధ, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ బాబూరావు, బాపట్ల బాపట్ల ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. మురళీ అధ్యక్షతన వార్షికోత్సవం వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా చట్టాలపై అవగాహనతో పాటు, ప్రస్తుత పరిస్థితులను న్యాయాధికారి సుధ వివరించారు. అలాగే అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, చరిత్ర, గణిత శాస్త్రం, క్రీడలు విభాగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత, లలిత కుమారి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలో విజేతగా నిలవాలి



జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టు

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో క్రీడా నైపుణ్యం చాటి విజేతగా నిలవాలని తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం ఖోఖో రాష్ట్ర పురుషుల జట్టు శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం సీతారామిరెడ్డి, ఉషారెడ్డి సమకూర్చిన క్రీడా దుస్తులను తహసీల్దార్ క్రీడాకారులకు అందచేశారు. కార్యక్రమంలో కోచ్ డీఎల్ రెడ్డి, మేనేజర్ గురుప్రసాద్ పాల్గొన్నారు. జట్టు శిక్షణకు సహకారం అందించిన గ్రామస్థులకు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల జట్టు

ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగే జాతీయ స్థాయి పురుషుల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టును అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శుక్రవారం ప్రకటించారు. ఈ జట్టులో కె.రామ్మోహన్, ఎం.ఫణికుమార్, కె.మహేష్, ఎం.ప్రసాద్, ఎ.వీరాంజనేయులు (ప్రకాశం), జె.నితేష్, వి.భానుప్రసాద్, పి.నరసయ్య (విజయనగరం), జి.సంతోష్ (అనంతపురం), ఎం.సాయివెంకట్(తూ.గో), హెచ్.రాజేష్ (చిత్తూరు), కె.ప్రవీణ్ (శ్రీకాకుళం), బి.కిరణ్ (విశాఖ), వై.వర్షిత్ ముకుందయాదవ్ (కృష్ణ), స్టాండ్ బైగా జి.నాగ వెంకటశివ (ప్రకాశం), హరిప్రసాద్ (కడప) పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా కేఆర్‌కే కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనరావు

అద్దంకిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కళాశాలలోని ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి అధ్యాపకులు ప్రసంగించారు. విద్యాలో ప్రతిభ కనబరిచిన, పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు, బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డి. రాజశేఖర్, డాక్టర్ సుశీలమ్మ, ఇతర విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పంగులూరులో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ తెలిపారు. విద్యుత్ నూతన లైన్‌ల నిర్మాణంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా పద్మావతి


- వైస్ చైర్మన్‌గా కాపు సామాజికవర్గానికి కేటాయించే అవకాశం
- వరుసగా మూడోసారి కూడా మహిళకే
- వ్యవసాయ కుటుంబం, కూరగాయల సాగుదారులు కావడంతో అన్నగారి సంత గాడిలో పడుతుందన్న ఆశలో రైతులు



అద్దంకి వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వరగాని పద్మావతిని ప్రభుత్వం ప్రకటించింది. అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్ ఎస్సీ మహిళకు కేటాయించడంతో కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నేత మందా నాగేశ్వరరావు కుమార్తె, వరగాని ప్రసన్నకుమార్ సతీమణి పద్మావతిని నియమించారు. వైస్ చైర్మన్‌గా అద్దంకి పట్టణానికి చెందిన కాపు సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేతకు కేటాయించనున్నట్లు తెలుస్తుంది. డైరెక్టర్‌ల జాబితా శనివారం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అద్దంకి ఏఎంసీ పరిధిలో అద్దంకి, కొరిశపాడు, పంగులూరు మండలాలు ఉన్నాయి. డైరెక్టర్‌ల కేటాయింపులో అన్ని సామాజిక వర్గాలను, అన్ని మండలాలకు ప్రాధాన్యం ఉండేలా జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ప్రసన్నకుమార్, పద్మావతి కుటుంబం వ్యవసాయమే ప్రధాన జీవనం కావడంతో పాటు కూరగాయల సాగు ఎక్కువగా చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అద్దంకి, మేదరమెట్లలో గత దశాబ్ద కాలంగా నిర్వహిస్తున్న అన్నగారి సంతకు మరలా పూర్వ వైభవం వస్తుందనే ఆశను రైతులు వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్‌లు ప్రారంభించిన తరువాత వరుసగా మూడో సారి కూడా మహిళకే దక్కింది. గత వైసీపీ హయాంలో తొలుత బీసీ మహిళకు కేటాయించగా పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన భువనేశ్వరికి దక్కింది. రెండోసారి ఎస్సీ మహిళకు కేటాయించడంతో కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన జజ్జర ఈశ్వరమ్మకు దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఎస్సీ మహిళకే దక్కింది. దీంతో వరుసగా మూడు సార్లు మహిళలు అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్‌లు అయ్యారు.

రైతులకు మేలు జరిగేలా కృషి



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తమ కుటుంబంపై నమ్మకంతో అప్పగించిన పదవికి న్యాయం చేస్తాను. రైతులకు మేలు జరిగేలా కృషి చేస్తాను. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి, మేదరమెట్లలో ప్రారంభించిన అన్నగారి సంతకు పూర్వ వైభవం వచ్చే విధంగా కృషి చేస్తాను.

\- వరగాని పద్మావతి
అద్దంకి ఏఎంసీ చైర్‌పర్సన్

పేదల సేవకే తెలుగుదేశం ఆవిర్భావం

- ఎన్టీఆర్ అంటే ఒక చరిత్ర, ఒక శక్తి
- గ్రామ గ్రామాన టీడీపీ జెండా ఎగురవేయాలి
- ఆశయాలను కొనసాగిస్తున్న చంద్రబాబు
- ఎమ్మెల్యే ఏలూరి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సేవ చేసేందుకే స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక చరిత్ర అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం పురస్కరించుకొని ఆయన ప్రసంగించారు. ఎన్టీఆర్ అంటే ఒక చరిత్ర, ఒక శక్తి అన్నారు. టీడీపీ అవిర్భావంతో రాష్ట్రంలో నూతన అధ్యయనం మొదలైందన్నారు. మహానుభావుడు ఎన్టీఆర్ రాజకీయం అంటే అధికారం అనుభవించటం కాదని, ప్రజలకు సేవ చేయడమని దేశ రాజకీయాలలో సంక్షేమ పాలన నేర్పారని ఏలూరి కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చంద్రబాబు చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్, జ్యోతిబాపూలే వంటి మహాశయుల స్ఫూర్తితో 1982లో పార్టీని నందమూరి తారక రామారావు ప్రకటించారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు కేవలం ఓటర్లగా మిగిలిపోకుండా రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని ఇటు పార్టీలోనూ, అటు పాలనలోనూ పదవులు ఇచ్చారని వారి వారసత్వాన్ని సీఎం చంద్రబాబు నేడు కొనసాగిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు.

అందరి సంతోషం కోసమే పవిత్ర రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాంత ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ముస్లింలు పవిత్ర రంజాన్ పండుగను నిర్వహిస్తారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని దేశాయిపేట సుబహాన్‌నగర్‌లో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ నియమ నిష్ఠలతో, అత్యున్నత పవిత్రంగా ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం చేస్తూ అందరి శాంతని కోరుకుంటారని అన్నారు. ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అందరికీ వడ్డించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఇమామ్‌లు, ముస్లిం మతపెద్దలు, ముస్లిం ప్రతినిధులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాలలో వసతులు

డ్వామా పీడీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

అద్దంకిటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు సుస్థిర ఆస్తులను ఏర్పాటుకు అవకాశం కలుగుతుం దని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అ న్నారు. శుక్రవారం అద్దంకి ఎంపీడీవో కా ర్యాలయం వద్ద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీడీవో బత్తిన సింగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభను మధ్యాహ్నం నుంచి ప్రారంభమై సాయంత్రం వరకు ప్రజా వేదిక నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల నుంచి సమస్యలను ప్రజా వేదికలో తెలియజేసేందుకు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ప్రజా వేదిక సభలో కేవలం అధికారులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మమ అనిపించారు. గ్రామాలలో జరిగిన వివిధ పనులు, లోపాలను సామాజిక తనిఖీ సిబ్బంది వివరించారు. మస్టర్‌లో సంతకాలు, వేలిముద్రలు లేకుండా నగదు చెల్లింపులపై, పండ్ల తోటల పెంపకంలో తొలగించిన మొక్కలపై పీడీ ప్రశ్నించారు. అద్దంకి మండలంలో 2023-24 సంవత్సారానికి సంబంధించి 834 పనులకు రూ.10.98 కోట్ల పనులు చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో మస్టర్‌లలో సంతకాలు లేకుండా వేతనాలు ఇవ్వడంపై ప్రశ్నించడంతో పా టు రికరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శోభన్‌బాబు, ఏపీడీ కోటయ్యనాయక్, ఎస్ఆర్‌పీ అప్పారా వు, ఏపీవో గాయత్రిదేవి, ఈసీ నాగరాజు, ఏఈ హనుమంతరావు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధిపనులు చేపట్టాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని 2023-24 సంవత్సరాలలో జరిగిన ఉ పాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి విజయలక్ష్మి హాజరయ్యా రు. గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ ప నుల సమగ్ర వివరాలను ఆడిట్ అధికారులు తెలిపారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15 నుంచి 20 పంట కుంటలు నిర్మించాలని ఆదేశించా రు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తుళ్లూరి వెంకటరమణ, ఎంపీడీవో ఆర్ రాజ్యలక్ష్మీ, పీఆర్ ఏఈ ప్రసాద్, బీపీవో సోబన్‌బాబు, క్వాలిటీ కంట్రోలర్ సతీష్, ఏపీవో కోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ సరే! మరి నీళ్లు ఎలా

(3వ పేజీ తరువాయి)

కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని మినరల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మరికొందరు విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాల బయట దొరికే నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. పాఠశాలల్లో బోధన గురించి పక్కన పెడితే విద్యార్థులకు కనీస అవసరమైన నీటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు ఇళ్ల నుంచి తెచ్చుకున్న నీటినే వినియోగిస్తున్నారు. ఆ నీరు అయిపోతే విద్యార్థులు బయటకు వెళ్లి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. లేదంటే ఇంటికి వెళ్లే వరకు దాహార్తితో అల్లాడిపోవాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉదయం 10, 11, 12 గంటలకు వాటర్ బెల్‌ను ఎలా అమలు చేయాలని ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు.

రూ.లక్షలతో ఏర్పాటు.. ఫలితం శూన్యం

2020లో నాడు-నేడు పథకంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేశారు. ఒక్కో వాటర్ ప్లాంట్ 50,000 లీటర్లు లక్ష, 2 లక్షలు లీటర్ల సామర్థ్యంతో కొనుగోలు చేశారు. సరఫరా, బిగించడం, నిర్వహణ కోసం ఒక్కో పాఠశాలకు రూ.2 లక్షల నుంచి రూ5 లక్షల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. అయితే ఏజెన్సీలు అనేక చోట్ల ప్లాంట్లు పంపిణీ చేసి వాటిని బిగించలేదు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేయకుండానే యంత్రాలను తీసుకు వచ్చి పాఠశాలల్లో పెట్టారు. తర్వాత షెడ్డు నిర్మించినా వాటిని బిగించకుండా మూలన పడేశారు. మరి కొన్ని చోట్ల నిర్వహణా లోపంతో వాడుకలోనికి తీసుకురాలేదు. ఫలితంగా పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. మరమ్మతులపై పాఠశాలల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకునే వారే లేరు. ప్రభుత్వం తాజాగా ఆర్వో ప్లాంట్ల విషయాన్ని తెలుసుకుని స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంతో కొన్ని పాఠశాలల్లో మాత్రం ఆర్వో ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పాఠశాలల్లో మాత్రం పరిస్థితి షరామామూలుగానే ఉంది.

■ ముఖాముఖి

పేదల సొంతింటి కల సాకారానికి చర్యలు

శ్రీనివాసరావు, చీరాల హౌసింగ్ డీఈ



నిరాశ్రయులకు, నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు చీరాల హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు ఆంధ్రజ్యోతితో ముఖాముఖిలో చెప్పారు.

ప్రశ్న : సొంతిల్లు లేని వారికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జవాబు : ప్రతిపేదకూ సొంతిల్లు నిర్మించుకునేందుకు గతం కంటే నగదు పెంచి రూ.2.50 లక్షలను ప్రభుత్వం అందజేస్తుంది.

ప్ర : గతంలో నిలిచిన నిర్మాణాల పరిస్థితి ఏమిటి ?

జ : గతంలో నిలిచిన నిర్మాణాలకు పూర్తి చేసేందుకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు అందిస్తున్నాం. అలాగే గతంలో లబ్ధిదారులకు అందాల్సిన నగదును సకాలంలో అందిస్తున్నాం.

ప్ర : తాజాగా మంజూరు చేస్తున్నారా?

జ : వేటపాలెం మండలం వరకు ఇప్పటికే సర్వే నిర్వహించి 591 అర్జీలు స్వీకరించి ఆన్‌లైన్ చేశాం. త్వరలోనే అప్రూవల్ జరుగుతాయి. ఇంకా అర్హులున్నా మంజూరుకు సిద్ధం చేస్తాం.

ప్ర : మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయా ?

జ : ఇల్లు నిర్మించుకుంటున్న ప్రతి లబ్ధిదారుకీ మరుగుదొడ్డి నిర్మాణానికి సూచనలు చేస్తున్నాం. ఇంటితో సంబంధం లేకుండా అదనంగా రూ.12 వేలు అందిస్తున్నాం. కానీ తప్పనిసరిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 90 రోజులు పని దినాలు ఉండేలా చూసుకోవాలి.



క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాలలో భారీ చోరీ

- ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగిలించిన దుండగులు
- సమీపంలో రైల్వే ట్రాక్, రాత్రిళ్లు జన సంచారం లేకపోవడంతో నేరస్థులకు తేలికగా పని
- సుమారు 25 సవర్ల బంగారు ఆభరణాలు మాయం?
- క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విఠల్ నగర్‌లో భారీ చోరీ జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో ప్రజల్లో భయాందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే ఆ ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి రజనికి ఇరువురు కుమారులు. ఒకరు హైదారాబాద్‌లో, మరొకరు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈక్రమంలో సుమారు వారం కిందట బెంగళూరులో ఉంటున్న కుమారుని వద్దకు రజని వెళ్లారు. అయితే రెక్కీ నిర్వహించిన గుర్తుతెలియని వ్యక్తులు, ఇంటి యజమాని లేకపోవడంతోపాటు ఎదురుగా రైల్వే ట్రాక్ ఉండడం, రాత్రిళ్లు అటువైపు జనసంచారం తక్కువగా ఉండడంతో చోరీకి అవకాశం కలిసి వచ్చింది. ఈక్రమంలో అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను దొంగిలించి పరారయ్యారు. దీంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. ఈక్రమంలో సుమారు 25 సవర్ల బంగారు ఆభరణాలు పోయినట్లు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం సహకారంతో ఆధారాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహనతోనే నేరాలకు అడ్డుకట్ట - వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు

ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి కచ్చితమైన ఆదేశాలు ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నాం. అయినా కొందరు నిర్లక్ష్యం, మరి కొందరు పని భారంతో సమాచారం ఇవ్వక పోవడంతో ఇలా చోరీలకు ఆస్కారం లభిస్తుంది. ఈక్రమంలో ప్రజల్లో అవగాహన కలిగినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యం. అజాగ్రత్తగా వ్యవహరిస్తే నేరాలు ఆగవు. వీధుల్లో ఉంటున్నవారు అవసరమైతే నేర నియంత్రణకు కలసి కట్టుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.

దాబాలలో మద్యం అమ్మితే కఠిన చర్యలు

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నామ్ రోడ్డు వెంబడి ఉన్న దాబాలలో మద్యం అమ్మకాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరాజు అన్నారు. శుక్రవారం సీఐ సుబ్బరాజు అద్దంకి పట్టణం సమీపంలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న డాబా లను తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలు జరిగినా, డ్రైవర్‌లు మద్యం సేవించినట్లు తెలిసినా దాబాల నిర్వహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అదే సమయంలో లారీలను రోడ్డు మార్జిన్‌లో ఆపకుండా దాబాల పక్కన ఉండే ఖాళీ స్థలాలలో నిలుపుకునేలా చూడాలన్నారు. లారీలు పార్కింగ్ చేసి న సమయంలో చోరీలు జరగకుండా అన్ని దాబాల వద్ద కాపలా వ్యక్తులను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు.

పమిడిపాడు మేజర్‌లో మహిళ మృతదేహం

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామ సమీపంలోని ఎన్నెస్పీ కెనాల్‌లో శుక్రవారం రాత్రి మహిళ మృదేహం గుర్తించారు. కాలువలో శవమై కనిపించిన మహిళ మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బిట్రా అన్నపూర్ణ (55)గా గుర్తించారు. కోనంకి గ్రామానికి చెందిన బిట్రా వెంకటకోటేశ్వరరావు భార్య అన్నపూర్ణ గురువారం మార్టూరు మండలం వరపర్లలోని బంధువుల ఇంటికి వెళి తిరిగి వస్తూ ఇంటికి చేరుకోలేదు. అన్నపూర్ణ మృతదేహం కాలువలో కనిపించిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయానిన కుటుంబ సభ్యులకు తెలిపినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

శిథిలావస్థలో అద్దంకి ఆర్టీసీ బస్టాండ్

- తరచూ మరమ్మతులు.. అయినా ఊడిపడుతున్న శ్లాబ్ పెచ్చులు
- కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం ఎదురు చూపులు
- మంత్రి గొట్టిపాటి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణికుల వేడుకోలు



శ్లాబ్‌కు గతంలో చేసిన మరమ్మతులు, పక్కడ ఊడిన శ్లాబ్ పెచ్చులు



ఊడిపడ్డ శ్లాబ్ పెచ్చులు

అద్దంకి, మార్చి28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో 4 దశాబ్దాల క్రితం నిర్మాణం చేసిన ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థ కు చేరింది. తరచూ మరమ్మతులు చేస్తున్నా శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతునే ఉన్నాయి. దీంతో ఈ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయం గుప్పిట్లో వేచి ఉండాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అద్దంకి పట్టణంలో 4 దశాబ్దాల క్రితం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం జరిగింది. మూడు దశాబ్దాల కాలం ఎలాంటి మరమ్మతులు లేకుండానే ఉన్నప్పటికి గత దశాబ్ద కాలం గా తరచూ మరమ్మతులకు గురవుతుంది. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. పలు సందర్భాలలో ప్రయాణికులు తృటిలో ప్రమాదాల నుండి తప్పించుకున్నారు. శ్లాబ్ కు పెచ్చులు ఊడిన చోట ప్యాచ్ వర్క్‌లు చేసినా వెంటనే పక్కనే మరో చోట ఊడి పడుతున్నాయి. దీంతో శ్లాబ్ మొత్తం ప్యాచ్ లతో నిండి ఉంది. గురువారం మరో సారి శ్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో మరలా తాత్కాళిక మరమ్మతులు ప్రారంభించారు. 4 దశాబ్దాలు దాటినందున కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టే దిశగా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ మంత్రి గా ఉన్నందున భవిష్యత్ అవసరాలను కూడా దృష్టి లో ఉంచుకొని ఎక్కువ ప్లాట్ ఫారమ్ లతో అన్ని హంగులతో కొత్త బస్టాండ్ నిర్మాణం చేపడితే మరో ఐదారు దశాబ్దాల పాటు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా ఉంటుందనే అభి ప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థ కు చేరి పెచ్చులు ఊడిపడుతున్న విషయాన్ని డిపో మేనేజర్ రామ్మోహనరావు దృష్టి కి తీసుకు పోగా కొత్త బస్టాండ్ నిర్మాణం కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఉన్నత పాఠశాలకు నోచుకోని కారంచేడు

- రూ.కోట్ల విలువ చేసే భూములు భవనాలను అప్పగించినా పట్టించుకోని అధికారులు



యార్లగడ్డ నాయడమ్మ ఓరియంటల్ ఉన్నత పాఠశాల (ఫైల్)

కారంచేడు (పర్చూరు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో కోట్ల విలువ చేసే భూములు, భవనాలు అప్పగించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉన్నత పాఠశాలకు నోచుకోలేదని కారంచేడు గ్రామస్థులు వాపోతున్నారు. రాష్ట్రంలోనే సినీ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులకు నిలయంగా ఉన్న కారంచేడులో విద్యాశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత పాఠశాలకు నోచుకోని స్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన యార్లగడ్డ వెంకన్న చౌదరి, యార్లగడ్డ రంగనాయకులు 1956లో యార్లగడ్డ నాయడమ్మ ఎయిడెడ్ పాఠశాల పేరుతో చల్లపల్లి రాజాగారి చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించారు. 1963లో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నూతన భవనాలను ప్రారంభించారు. అప్పటి నుంచి వేలాది మంది ఇక్కడ విద్యను అభ్యసించారు. అవిభక్త కలవలల శస్త్ర చికిత్సకు పేరుపొందిన నాయుడమ్మతోపాటు, మంత్రిగా పనిచేయడమే కాక లోక్ సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ దగ్గుబాటికి విద్యాబుద్ధులు నేర్పింది ఈపాఠశాలే. ఎందరో విద్యార్థులను ఉన్నత శిఖరానికి చేర్పిన ఈపాఠశాల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. 2022లో గత వైసీపీ తెచ్చిన నూతన విధానానికి అనుగుణంగా పాఠశాల కరస్పాండెంట్ రఘుబాబు ఇతర కమిటీ సభ్యులు కోట్లాది రూపాయల విలువచేసే ఎకరం భూమిలో నిర్మించిన 12 గదుల భవనాన్ని ప్రభుత్వానికి స్వాధీనపరిచారు. నిబంధనల మేరకు ప్రభుత్వం పాఠశాల నిర్వహించాల్సి ఉండగా యూడైస్ కోడ్‌ను పిల్లలు లేరన్న నెపంతో రద్దు చేశారని కమిటీ ప్రతినిధులు చెప్పన్నారు. తిరిగి పాఠశాలను ప్రారంభించడానికి కరస్పాండెంట్ రఘుబాబు ప్రస్తుత పాఠశాల కమిషనర్ దృష్టికి తీసుకుపోయిన క్రమంలో కింది స్థాయి అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదని ప్రజలు అంటున్నారు. చీరాల ఉపవిద్యాశాకాధికారితోపాటు, కారంచేడు ఎంఈవోకు పాఠశాలను పూర్తిస్థాయిలో అప్పగించిన ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత పాఠశాల సేవలకు కారంచేడు విద్యార్థులు దూరంకాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఐకి ప్రశంసాపత్రం



ఎస్పీ డూడీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో అద్దంకి పోలీస్ స్టేషన్‌కు చెందిన 33 కేసులు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేసిన అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజును ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కామైన పోలీస్ స్టేషన్ లలో అద్దంకి స్టేషన్ ద్వితీయ స్థానంలో నిలవడంతో సీఐ సుబ్బరాజును శు క్రవారం బాపట్లలో జరిగిన సమావేశం అనంతరం సీఐకి ప్రశంసాప త్రంతో ఎస్పీ అభినందించారు.



వీర్లకొండ వద్ద ఎస్ ఆర్ గ్రానైట్ క్వారీని తనిఖీ చేస్తున్న డీడీఎంఎస్ జ్ఞానేశ్వర్

క్వారీల్లో భద్రత చర్యలు పటిష్టంగా అమలు చేయాలి

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ క్వారీలలో పనుల వద్ద భద్రత చర్యలు పటిష్ఠంగా అమలు చేయాలని మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డెరెక్టర్ (డీడీఎంఎస్) జ్ఞానేశ్వర్ కోరారు. శనివారం మండల పరిధిలోని వీర్లకొండ వద్ద గత ఎస్‌ఆర్, కిషోర్, హనుమాన్ ఎక్స్‌పోర్ట్సు గ్రానైట్ క్వారీలను డీడీఎంస్ తనిఖీలు చేశారు. ఈసందర్భంగా క్వారీలలో జరుగుతున్న పనుల వివరాలను పరిశీలించారు. ఎంత మంది సిబ్బంది పనులలో ఉన్నారు. మేనేజర్లు ఉన్నారా బౌండ్రీ ప్రకారం పనులు చేస్తున్నారా పరిశీలించారు. పనుల వద్ద నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలానే ప్రమాదాలు జరగకుండా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ తనిఖీలో సేఫ్టీ సిబ్బంది సుబాస్కర్‌రెడ్డి, క్వారీల మేనేజర్లు నాగేశ్వరాబాబు, కాంతరాజు, మాలపాటి పోతురాజు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

మార్టూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మార్టూరు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు కామినేని జనార్దన్, రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ రజాక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, బూత్ కన్వీనర్లు, కన్వీనర్లు తరలిరావాలని కోరారు.

రైతుల సేవే మన గ్రోమోర్ లక్ష్యం

గుంటుపల్లిలో మినరల్ ఆర్వో ప్లాంటు ప్రారంభం



గుంటుపల్లిలో మినరల్ ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మన గ్రోమోర్ జోనల్ మేనేజర్ సురేష్

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సేవలు అందించడమే మన గ్రోమోర్ లక్ష్యమని ఆ శాఖ జోనల్ మేనేజర్ సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో కోరమండల్ కంపెనీ, బల్లికురవ మన గ్రోమోర్ కేంద్రం సహకారంతో రూ.3 లక్షలు వెచ్చించి రైతులకు మినరల్ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా జోనల్ మేనేజర్ మాట్లాడుతూ తమ సంస్థ ఏటా ఒక్కో గ్రామంలో రైతులకు ప్రజలకు ఉపయోగ పడే సేవా కార్యక్రమాలను చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాదాల శ్రీమన్నారాయణ, గ్రోమోర్ మేనేజర్లు మణికంఠ, రాజేష్, చెన్నాచారి, అనీల్, రైతులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడా పోటీలో ప్రతిభచాటిన సర్వేయర్

రవిబాబును సత్కరించిన తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశ స్థాయిలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో సత్తా చాటిన ముప్పవరం సచివాలయ సర్వేయర్ పి.రవిబాబును తహసీల్దార్ పి.సింగారావు సత్కరించారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ దేశ రాజధాని డిల్లీలో ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించిన ఖోఖో క్రీడా పోటీలలో రాష్ట్ర జట్టులో పాల్గొని క్రీడా నైపుణ్యం చాటి జట్టు బ్రాంజ్ మెడల్ సాదనలో తోడ్పడ్డారు. విద్యార్థి దశలోనే ఖోఖోలో జాతీయ క్రీడాకారుడిగా రాణించి ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ఖోఖో పురుషుల జట్టుకు ఎంపికై ప్రతిభ చాటిన రవిబాబును మండల సర్వేయర్ సురేష్, సీనియర్ సహాయకులు శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది అభినందించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలో ప్రతిభచాటిన గ్రామ సర్వేయర్ రవిబాబును సత్కరిస్తున్న తహసీల్దార్ సింగారావు



గుండ్లకమ్మ నదిలో ఊటబావులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అద్దంకి పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు గుండ్లకమ్మ నదిలో ఊటబావుల నుంచి మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు పంపింగ్ చేసి విడుదల చేస్తున్నారు. రామ్‌నగర్, కాకానిపాలెం ట్యాంక్‌లకు నీటిని గుండ్లకమ్మ నదిలో సామాజికవనం (సోషల్ ఫారెస్ట్) సమీపంలో ఉన్న ఊటబాబుల నుంచి పంపింగ్ జరుగుతుంది. అయితే వేసవిలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉండడంతో మండలంలోని నాగులపాడు కు నీటి సరఫరా జరిగి ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఊటబావిని కూడా వినియోగంలోకి తీసుకొచ్చి రామ్‌నగర్ ట్యాంక్‌కు పంపింగ్ చేస్తున్నారు. అదే సమయంలో ధేనువ కొండ పునరావాసకాలనీకి చెందిన ఊటబావి కూడా ఖాళీగా ఉండడంతో కాకానిపాలెం ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే విధంగా మోటార్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకు వచ్చినట్లు కమిషనర్ రవీంద్ర తెలిపారు.

పేద బాలికలకు పౌష్టికాహారం పంపిణీ



బాలికలకు ఆహర కిట్లను అందజేస్తున్న వెంకటమోహనరావు

మార్టూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం వందమంది నిరుపేదలైన బాలికలకు స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఆరెంజ్ ఎలిఫ్యాంట్ అనే అమెరికా సంస్థ ఆర్థిక సహకారంతో 15 రకాలతో కూడిన పౌష్టికాహార కిట్లను బాలికలకు మోహనరావు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మంచి పౌషకాహారం తీసుకున్నపుడే బాలికలు శారీరకంగా, ఆరోగ్యంగా చదువు కోగలరని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు హఫీజా, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఈశ్వరప్రసాద్, షేక్ కాజాహుస్సేన్,మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.

అభివృద్ధికే బడ్జెట్‌లో ప్రాధాన్యం

- క్రిటికల్ కేర్‌కు కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించిన పాలకవర్గం, అధికారులు
- ప్రశాంతంగా ముగిసిన మునిసిపల్ బడ్జెట్ సమావేశం



బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్యను గజమాలతో సత్కరిస్తున్న మునిసిపల్ చైర్మన్, అధికారులు, కౌన్సిలర్‌లు

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ బడ్జెట్ కౌన్సిల్ సమావేశం ప్రశాతంగా ముగిసింది. 2025-26కు సంబంధించి జరిపిన బడ్జెట్ కేటాయింపుల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. మొత్తం నిధులు రూ62.64కోట్లు ప్రవేశపెట్టగా, అందులో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.39కోట్లు, సాధారణ ఖర్చులు (ఇంధనం, జీతాలు, వగైరా ఖర్చులు) రూ.22 కోట్లకు కేటాయింపులు జరిపారు. అలాగే మిగులు బడ్జెట్ రూ.60.52లక్షలు ఉంటుందని అధికారులు వివరించారు. అయితే కేటాయింపుల్లో ఒకటి రెండు అంశాలపై స్వల్పంగా చర్చలు జరిగినప్పటికీ మిగతా అంశాలపై ప్రశాంతంగా ముగిసింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కొండయ్య ఏరియా ఆసుపత్రికి క్రిటికల్ కేర్‌ను తీసుకురావడంపై సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. సమావేశం ముగిశాక గజమాలతో ఆయన్ని ఘనంగా సన్మానించారు.

భేషజాలు లేవు..అభివృద్ధికి సహకరించండి - ఎమ్మెల్యే కొండయ్య

సభా సమయంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పార్టీలకు, ఇతర అనవసరమైన అంశాలకు ప్రాధాన్యమివ్వనని స్పష్టంగా చెప్పారు. నమ్మి ప్రజలు తనను గెలిపించాలరని, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేద్దామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. టీడీపీ కూటమి పూర్తిగా అభివృద్ధిపైనే దృష్టి సారించిందని ప్రకటించగా హర్షధ్వానాలతో సభా ప్రాంగణం మారుమోగింది.

గిన్నిస్ బుక్‌లో మెప్మా మొదటి స్థానం సాధించడంపై అభినందనలు

ఇటీవల మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మూడు రకాల కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న మెప్మా విభాగం గిన్నిస్ బుక్ రికార్డు సాధించడంపై ఎమ్మెల్యే కొండయ్య మెప్మా విభాగం ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఒకేరోజు 10 వేల మంది ఎన్ఎంఎస్ శిక్షణలో పాల్గొని, పరీక్షకు హాజరుకావడం, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన మార్ట్‌లో చీరాల నుంచి అత్యధికంగా కొనుగోలు చేయడం,అధిక సంఖ్యలో పొదుపు మహిళా సంఘాలు ఇక్కడే ఉండడంపై చీరాల మెప్మా విభాగం గిన్నీస్ బుక్‌లో రికార్డు సాధించిందని వివరించారు. ఎమ్మెల్యే కొండయ్య చీరాల మెప్మా విభాగం సీఏఎం కొండయ్య, ఆర్పీలు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మునిసిల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీల భారం తొలగించాలి

చీరాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల భారం తగ్గించాలని పలువురు సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. జగన్‌రెడ్డి పాలనలో విద్యుత్ బిల్లుల భారంతో వినియోగదారులు అల్లాడిపోయారని, కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు పడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్.బాబూరావు, వసంతరావు, జయరాజు, సత్యమూర్తి, ప్రసాద్, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు అద్దంకి మున్సిపల్ సమావేశం

అద్దంకి, మార్చి28(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ రవీం ద్ర తెలిపారు. మొత్తం 20 అంశాలతో అజెండా రూపొందించారు.

మండల పరిషత్‌లో మూలుగుతున్న నిధులు

- గ్రామాల్లో జరగని అభివృద్ధి పనులు
- పాత బకాయిలు చెల్లిస్తారా, కొత్త పనులకు ఆమోదముద్ర వేస్తారా
- నేడు సర్వసభ్య సమావేశం




వైదనలో కల్వర్టులు లేక నడవలేని స్థితిలో ఉన్న సీసీ రోడ్డు

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలోసారి గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్వ సభ్య సమావేశం సర్వ సాధారణంగా జరుగుతుంది. ఎన్ని సమావేశాలు జరిగిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు లేకుండానే సాదాసీదాగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు. శనివారం జరిగే సమావేశంలో అయినా అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు ఉంటాయా లేదా అని ప్రజలు ఎదురు చూపులు చూస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఖాతాలో సీనరేజీ నిధులు సుమారు రూ.1.50కోట్ల నిధులు జమ అయి ఉన్నాయి. ఈ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంది. కానీ కొన్ని నెలలుగా నిధులు అలానే ఉన్నాయి. గతంలో వైసీపీ నేతలు కొందరు ఎన్నికల సమయంలో హడావుడిగా మట్టి రోడ్లు వేశారు. వారిక కొంత బిల్లులు చెల్లింపులు చేయాల్సి ఉంది. పాత బకాయిలకు తోడు కొత్త పనులకు అమోదముద్ర వేస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. చాలా గ్రామాలలో అభివృద్ధి అటకెక్కి ఉంది. గ్రామాలలో మురికి కాలవలు నిర్మాణాలు లేక రోడ్లపై మురుగు పారుతోంది. అలానే ప్రభుత్వ కార్యాలయల వద్ద పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో 90 శాతం పూర్తి అయిన ప్రభుత్వ భవనాలు పనులు నిలిచి ఉన్నాయి. వీటికి కొంత నిధులు కేటాయిస్తే అవి వినియెగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండల పరిషత్ నిధులను గ్రామాల అభివృద్ధికి కేటాయించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నక్కబొక్కలపాడులో చోరీ

బల్లికురవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడులో పొలం పనులకు వెళ్లిన సమయాన్ని గుర్తించి ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి చోరీ చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన ఆలకుంట లక్ష్మీతిరుపతమ్మ కూలి పనులకు శుక్రవారం వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి బీరువా పగులగొట్టి అందులోని రూ.50వేల నగదు, ఒకటిన్నర సవర్ల బంగారు వస్తువు చోరీకి గురైనట్లు గుర్తించింది. వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



- పెన్నా ప్యాకేజీ-1 అక్రమాలపై అధికారుల మౌనం
- ఆధారాలు ఉన్నా స్పందించని ఇరిగేషన్‌శాఖ
- కలెక్టర్ కోరినా వివరణ ఇవ్వని వైనం
- ప్రీక్లోజ్ తర్వాత సీఈ ఎలా రివైజ్ చేశారో..!?

అంతా గప్‌చుప్..!

నెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అధికారమే అండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధికి భారీ లబ్ధి చేకూరుస్తూ ఇరిగేషన్ అధికారులు అక్రమాలకు తెరలేపారు. పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనులకు సంబంధించి ఏకంగా సర్టిఫికెట్లనే కొట్టివేసి రూ.4.12 కోట్లు అదనంగా బిల్లు చేశారు. అంతకుముందు ఇదే 48వ బిల్లు పేరుతో మరో రూ.4.40 కోట్లకు క్యూసీలు మంజూరు చేశారు. ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక రివైజ్ పేరుతో భారీగా అంచనాలు పెంచారు. ఈ మొత్తం బాగోతంలో రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఇందుకు సంబంధించి ఆధారాలతో సహా బయటకు వచ్చినా ఇరిగేషన్‌శాఖ స్పందించడం లేదు. అసలు వాస్తవాలేమిటన్నది నిగ్గు తేలుద్దామన్న ఆలోచన కూడా వారిలో కనిపించడం లేదు. అసలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటే ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వస్తున్నా, కనీసం వీటిని పట్టించుకునే తీరిక కూడా రాష్ట్ర ఉన్నతాధికారులకు లేకుండా పోతోంది. అయితే ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని జిల్లాస్థాయి అధికారులు, రాష్ట్ర స్థాయి ఉన్నతా. దికారులను తప్పుదోవ పట్టిస్తు న్నట్లు సమాచారం. అవక తవకలు జరిగినట్లు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీటిపై విచారణ జరిపితే వాస్తవాలు తేలుతాయి. అయితే జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఇరిగేషన్ అధికారులెవరూ కూడా ఈ ఆరోపణలపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



కలెక్టర్ ఆదేశించినా...

పెన్నా డెల్టా ఆధునికీకరణ ప్యాకేజీ-1 పనుల్లో జరిగిన అవకత వకలపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ ఆనంద్.. అందుకు వివరణ ఇవ్వాలంటూ ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను ఆదేశించారు. అయితే వారం గడిచినా ఇంత వరకూ ఇరిగేషన్ శాఖ నుంచి వివరణ అందలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్యాకేజీ-1 పనుల బిల్లులపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ సెంట్రల్ డివిజన్ ఈఈకి ఇరిగేషన్ ఎస్ఈ లేఖ రాశారు. అయితే ఈఈ నుంచి స్పందన లేకపోవడంతో మరోసారి ఎస్ఈ ఇదే అంశంపై ఈఈకు మరో మెమో ఇచ్చా రు. దీన్ని అతి ముఖ్యమైన అంశంగా భావించి వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునేందుకు పైఅధికారులకు లేఖ రాస్తామని ఎస్ఈ హెచ్చరించారు. కాగా ప్యాకేజీ-1 పనులకు సంబంధించి మరో వివాదా స్పద నిర్ణయం బయటకొచ్చింది. సాధారణంగా ప్రభుత్వం ఒక వర్కును ఫైనాన్స్ శాఖ అప్రూ వల్‌తో ప్రీక్లోజ్ చేశాక కింది స్థాయి అధికారులు దాన్ని రివైజ్ చేయడం వీలుకాదని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ రివైజ్ చేయాలంటే మళ్లీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అప్రూవల్ అవసరమవుతుందని అంటున్నారు. కానీ ప్యాకేజీ-1 విషయంలో ప్రభుత్వం ప్రీక్లోజ్ చేస్తూ జీవో ఇచ్చిన రెండేళ్ల తర్వాత తిరుపతి సీఈ ఎస్టిమేషన్లు రివైజ్ చేశారు. రూ.308 కోట్ల అగ్రిమెంటు వ్యాల్యూను రూ.408 కోట్లకు పెంచారు. మరి ఈ రివైజ్ అన్నది ప్రభుత్వ అనుమతితోనే జరిగిందా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

అయితే ఇందుకు సంబంధించి డాక్యుమెంట్లు అడుగుతున్నా ఇరిగేషన్ అధికారులు బయటపెట్టక పోతుండడం పలు అనుమానాలకు బలం చేకూరుస్తోంది. విచారణ జరిగితే వాస్తవాలు వెలుగు లోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహా రంపై ఇరిగేషన్ ఎస్ఈ దేశా నాయక్‌ను వివరణ కోరగా ప్యాకేజీ-1కు సంబంధిం చిన రికార్డులు అప్పగించా ల్సిందిగా సెంట్రల్ డివిజన్ ఈఈకు మెమో ఇచ్చామని చెప్పారు. అక్కడి నుంచి స్పందన రాకపోవడంతో మరోసారి కూడా మెమో ఇచ్చామని, ఆ తర్వాత కూడా రికార్డులు ఇవ్వకుంటే తామే వెళ్లి స్వాధీనం చేసుకుం టామని పేర్కొన్నారు.

మాల కొండ హుండీ ఆదాయం రూ.82 లక్షలు

5లో..

ముస్లింలకు అండగా ప్రభుత్వం

- మంత్రి రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ముస్లింలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 441 మసీదుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3.96లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. 852 మంది ఇమామ్‌లు, మౌజన్ల జీతాల కోసం రూ.66.15లక్షలు మంజూరు చేసిందన్నారు. అబ్దుల్ అజీజ్ కు వక్ఫ్‌బోర్డు పదవి ఇచ్చి మైనార్టీలకు సముచిత గౌరవం ఇచ్చామన్నారు. కోటమిట్ట షాదీమంజిల్‌లో ఫర్నీ చరుకు తన సొంత నిధులు ఖర్చు చేస్తామని నారాయణ తెలిపారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లా డుతూ దేశంలో ఏమి జరుగుతున్నా రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు ముస్లింలకు అండగా ఉన్నారని ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



నెల్లూరు : కస్తూరిదేవి గార్డెన్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో భాగంగా దువా చేస్తున్న మంత్రి ఆనం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి, కలెక్టర్ ఆనంద్, తదితరులు

నగరంలో ఘనంగా ఇఫ్తార్ విందు

- **భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు**

ఈ సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ ఓ.ఆనంద్, నగర కమిషనర్ సూర్యతేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు నన్నేసాహెబ్, బ్రహ్మంగుప్తా, రాజానాయుడు, జలదంకి సుధాకర్, షంషుద్దీన్‌లతో బాటు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పర్యవేక్షించారు.



ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ

- అధికారులు సమర్థవంతంగా పనిచేయాలి
- సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయో తెలుసుకునేందుకు ప్రభుత్వం వారి నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నదని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఈ అంశమై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజా మన్ననలను పొందాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను ఐవీ ఆర్ కాల్స్, క్యూఆర్ కోడ్, వాట్సప్‌ల ద్వారా తెలుసుకుంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రజలకు ఎంత మంచి సేవలు అందుతు న్నాయో తెలుసుకుని, మరింత మెరుగు పరచడానికే ఈ అభిప్రాయ సేకరణ అని పేర్కొన్నారు. ప్రతి వారం ఒక్కో అంశంపై అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. నాలుగు వారాల్లో ఈ ప్రక్రియ పూర్తవు తుందని తెలిపారు. అభిప్రాయాలు వెలిబుచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వివరించారు. వైద్యశాలలో పేదలకు అందించే సేవలు, పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే నిత్యావసరాలు, ఆర్‌టీసీ బస్సుల సమయపాలన, అన్న క్యాంటీన్లలో అందజేసే ఆహార పదార్థాల నాణ్యత, ఆలయాల్లో ప్రసాదాల నాణ్యత తదితరాల అంశాలపై వచ్చే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతినెలా ఈ అంశాలపై సమీక్ష చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, డీఎంహెచ్‌వో సుజాత, డీసీహెచ్ ఎస్.శేషారత్నం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.27 (శనివారం సాయంత్రం)

సహరి : 4.50 (ఆదివారం ఉదయం)

'ఇండోసోల్'కు భూములు

- కరేడు పరిసరాల్లో 8,348 ఎకరాల సేకరణకు ప్రభుత్వం నిర్ణయం
- ఏపీఐఐసీకి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు
- ఏపీ మారిటైమ్ బోర్డు నుంచి నిధుల బదలాయింపునకు నిర్ణయం
- చెరువు నీరు పరిశ్రమలకు కేటాయింపు
- గ్రామ పరిధిలో 220కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్
- ఆగ్రహిస్తున్న గ్రామస్థులు
- పోరాటానికి సిద్ధమంటున్న రైతులు

కందుకూరు/ ఉలవపాడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ పరిశ్రమకు అవసరమైన భూముల సేకరణకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు సాగిన ఊహాగానాలకు తెరపడినట్లైంది. మండలంలోని కరేడు గ్రామంతోపాటు మన్నేరు వాగుకు అవతలివైపు ఉన్న ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామం భూములను కలుపుకొని 8348 ఎకరాలు కేటాయించినట్లు ఆ జీవోలో పేర్కొన్నారు. ఇప్పటికే గుడ్లూరు మండలం చేవూరు గ్రామంలో 114 ఎకరాల భూమి కేటాయించారు. దీంతో కార్యాలయం, ఎక్యూప్‌మెంట్స్ నిల్వలు, సిబ్బంది క్వార్టర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటుకు రూ. 69,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పరిశ్రమ పూర్తయితే ప్రత్యక్షంగా 13,050 మంది యువతకు, పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి లభించనున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా కరేడు గ్రామ పరిధిలో 12,000 ఎకరాల భూములు ఉండగా, వాటిలో కొన్ని మాగాణి భూములుకాగా, తీర ప్రాంతం భూముల్లో వేరుశనగ, మామిడి సాగు చేస్తున్నారు. ఇండోసోల్ పరిశ్రమవారికి 8348 ఎకరాలు భూమిని ఇస్తే గ్రామాలే మిగిలిపోతాయి, కాలక్రమేణా ఆ గ్రామాలను కూడా ఖాళీ చేయించి వాటి నామరూపాలు లేకుండా చేస్తారనేది గ్రామస్థుల భయాందోళన.


ప్రజాభిప్రాయం అవసరం లేదా..?

భారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నప్పుడు ఆ ప్రాంతంలోని ప్రజల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం లేదా... అని కరేడు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సభ నిర్వహించి ప్రజల మనోభావాలను అర్థం చేసుకొని ప్రభుత్వం తలపెట్టిన పరిశ్రమ వల్ల లాభనష్టాలు, ప్రజల అనుమానాలు తీర్చకుండా భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నదని మాజీ ఎంపీటీసీ, బీసీ సంఘం నాయకుడు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండోసోల్ పరిశ్రమకు ప్రభుత్వం భారీ రాయితీలు ఇస్తూ, పచ్చటి, సారవంతమైన భూములు అప్పచెప్పాలని చూస్తున్నదని, ఈ నియంతృత్వ ధోరణిని ఎదుర్కొనేందుకు త్వరలోనే భారీ ఉద్యమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భూ సేకరణ బాధ్యతలు ఏపీఐఐసీకి ..

రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణ బాధ్యతలను ఇప్పటివరకు ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారానే జరుగుతున్నాయి. అయితే ఇండోసోల్ పరిశ్రమలకు భూములను సేకరించే బాధ్యతను మాత్రం ఏపీఐఐసీకి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ నిబంధనలకు అనుగుణంగా ఏపీఐ ఐసీ రైతుల నుంచి భూములను సేకరిస్తుందని, ఎవరైనా రైతులు భూములు అమ్మేందుకు విముఖత చూపితే వారివద్ద లీజుకి తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. భూమిలిచ్చే రైతులకు ఏటా రూ. 31300 లీజు చెల్లించేలా ప్రతి రెండేళ్లకు ఐదు శాతం పెంచు కుంటూ పోయేలా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

భూములు కాపాడుకుంటాం



కరేడులోని సారవంతమైన భూములు వదులుకోవడం గ్రామస్థులకు ఇష్టం లేదు. పంచాయతీ పరిధిలోని మత్స్యకారులు, పల్లెకారులు, ఎస్టీల అభిప్రాయం సేకరించకుండా దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూడడం దారుణం. ప్రజా ఉద్యమాన్ని చేపట్టి భూములు కాపాడుకుంటాం.

- మిరియం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ, కరేడు

ఐక్యంగా పోరాడుతాం...



ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న గ్రామాన్ని పరిశ్రమల పేరిట కలుషితం చేస్తున్న ప్రభుత్వం చర్యలను వ్యతిరేకిస్తున్నాం. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను కోల్పోవడానికి సిద్ధంగా లేం. గ్రామస్థులంతా ఐక్యంగా పోరాడుతాం.

- వాకా రాజశేఖర్‌రెడ్డి, రైతు, కరేడు

భూములు లాగేసుకుంటే మా పరిస్థితి ఏమిటి ?



మత్స్యకార గ్రామాలైన టెంకాయచెట్లపాలెం, అలగాయపాలెం, కొత్తపల్లెపాలెం గ్రామాల్లో వేరుశనగను నమ్ముకొని ఏడాదికి రెండుసార్లు పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పుడు పరిశ్రమల పేరిట భూములు లాగేసుకుంటే మా పరిస్థితి ఏమిటి ? మా భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేం.

- వాయిల శ్రీను, వేరుశనగ రైతు, టెంకాయచెట్లపాలెం, కరేడు పంచాయతీ

చెరువు నీరు వినియోగం

కరేడు చెరువు ఆయకట్టు భూమినంతటినీ భూసేకరణలో తీసుకోనున్నందున కరేడు చెరువు నీటిని ఈ పరిశ్రమలకు కేటాయించనున్నట్లు కూడా ఆ ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. అలాగే చేవూరు పరిధిలో ఇప్పటికే ఏర్పాటై ఉన్న 114.5 ఎకరాల్లోని మాడ్యూల్స్ తయారీ ప్లాంట్‌కు అవసరమైన నీటిని చేవూరు చెరువు నుంచి ప్రతిరోజు 7 మిలియన్ లీటర్లు వాడుకునేలా అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులిచ్చారు.

- **220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు**

ఇండోసోల్ సోలార్ ఎనర్జీ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పంపిణీచేసేందుకు వీలుగా ఏపీ ట్రాన్స్‌కో ద్వారా అక్కడ 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయ టంతో పాటు తదనుగుణంగా అవసరమైన అన్నిచర్యలు తీసుకునే బాధ్యతలను ఏపీ ట్రాన్స్‌కోకు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి

- మూడో జాబితాలో జిల్లా నుంచి ఒక్కరే ఎంపిక

మనుబోలు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం మూడో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలోసర్వేపల్లి ఏఎంసీ చైర్మన్‌గా మనుబోలు మండల టీడీపీ అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డిని ఎంపిక చేశారు. మొదట విడతగా గత ఏడాది సెప్టెంబరులోనూ, రెండో విడతగా నవంబరులోనూ కొన్ని కార్పొరేషన్లను, ఇతర పదవులను పార్టీనేతలకు, కార్యకర్తలకు కట్టబెట్టారు. తాజాగా మూడో జాబితాను ప్రకటించారు. మొదటి విడతలో జిల్లాలోని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిలకు టీడీపీ తరపున, సన్నపు రెడ్డి సురేష్‌రెడ్డికి బీజేపీ తరపున, వేములపాటి అజయ్‌కుమార్‌కు జనసేన తరపున పదవులు దక్కాయి. రెండు విడతలో అబ్దుల్ అజీజ్‌కు పదవి వరించింది. మూడో విడతలో రామకృష్ణారెడ్డి ఒక్కరికే పదవి దక్కడం విశేషం. మనుబోలు మండలం పిడూరుపాళెం గ్రామానికి చెందిన ఆయన ఎన్నో ఏళ్లుగా టీడీపీలో కొనసాగుతున్నారు. గత ఆరేళ్లుగా మండలాధ్యక్షుడిగా కొనసాగుతూ, గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం బాగా శ్రమించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొద్ది నెలల క్రితం ఏఎంసీ చైర్మన్‌గా గాలిని ప్రతిపాదిస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి అధిష్టానానికి ప్రతిపాదనలు పంపారు. తనకు పదవివచ్చేలా కృషిచేసిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఈ సందర్భంగా గాలి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాక పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు.త్వరలో ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు.



గాలి రామకృష్ణారెడ్డి

ఉగాది నాడు అర్చకులకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లా స్థాయిలో ముగ్గురు అర్చకులు, ఒక వేద పండితునికి ఉగాది పురస్కారం అందజేస్తున్నట్లు దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జొన్నవాడ కామాక్షితాయి ఆలయ వేద పండితుడు టీ పవన్ కుమార్‌శర్మ, అర్చకులు యూ నందకిషోర్ (ఇందుకూరుపేట, కొత్తూరు వీరాంజనేయ స్వామి ఆలయం), ఏ రామకృష్ణ (సోమశిల సోమేశ్వరాలయం), టీ వెంకటేశ్వర్లు (గొలగమూడి వీరాంజనేయస్వామి ఆలయం)ను ఎంపిక చేశామని తెలిపారు. వీరిని రూ.10వేల నగదు పారితోషికం, పట్టువస్త్రాలతో సన్మానిస్తామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ప్రతీ ఆలయంలో విశేష పూజలు, పంచాంగ శ్రవణం, వాహన సేవలతోపాటు అర్చకులకు సన్మానాలు జరుగుతాయని తెలిపారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు టీవీ ప్రసాద్,తదితరులు

షుగర్ ఫ్యాక్టరీ భూమిని ఇవ్వడం తగదు

కోవూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోవూరు షుగర్ ఫ్యాక్టరీ భూమిని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ)కు ఇవ్వడం తగదని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శుక్రవారం వారు స్థానిక సీతాపోలయ్య భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు టీవీ ప్రసాద్ మాటాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయం లో చక్కెర కర్మాగారాన్ని పునఃప్రారంభిస్తామని వాగ్దానం చేసి కొత్త పరిశ్రమలకు ఫ్యాక్టరీ భూమిని కేటాయించడం తగదన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా చెరకు పండించేందుకు రైతులు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. విలువైన భూమిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తనాటకానికి తెరదీసిందన్నారు. జిల్లాలోని 15మండలాల్లోని గ్రామాల్లో 5,840మంది షేర్ హోల్డర్లు ఫ్యాక్టరీ భాగస్వాములన్నారు. షేర్ హోల్డర్ల హక్కును కాలరాసి సహకార రంగంలో కొనసాగే ఫ్యాక్టరీ భూమిని కార్పొరేట్‌శక్తులకు అప్పగించడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోనె దయాకరరావు, ముత్యాల గురునాథం, గండవరపు శ్రీనివాసులు, పులిగండ్ల శ్రీరాములు, గండవరపు శేషయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు శాశ్వత గుర్తింపు

- యూడీఐడీ పేరుతో కొత్త కార్డులు
- నేరుగా ఇంటికే చేరేలా ప్రణాళిక
- మీసేవ, ఇంటర్నెట్‌ల ద్వారా దరఖాస్తు
- దేశమంతా వర్తించేలా కేంద్రం చర్యలు
- తప్పనున్న 'సదరం' ఇక్కట్లు

సంగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం శుభ వార్త చెప్పింది. వారికి శాశ్వత గుర్తింపు కార్డు జారీ చేసేందుకు శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేసే సంక్షేమ పథకాల లబ్ధి పొందాలంటే సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఇందుకుగాను సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి నిర్దేశించిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి వైకల్యాన్ని నిర్ధారించి వైద్యులు సర్టిఫికెట్ జారీ చేసేవారు. ఆ సర్టిఫికెట్‌తో వారు బస్సు రైల్వే పాసులకు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు. ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో వెంట తీసుకెళ్లేవారు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ కేంద్రం వీటి స్థానంలో యూడీఐడీ (యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని తీసుకొచ్చింది. త్వరలో ఈ ప్రక్రియను జిల్లాలో ప్రారంభించనున్నారు.

● దరఖాస్తు ఎలా అంటే...

మీసేవ, ఇంటర్‌నెట్, ఏపీ ఆన్‌లైన్, సీఎస్‌సీ, మొబైల్ ఆన్‌లైన్‌లో స్వావలంబన్ కార్డు జీవోవీ.ఇన్.వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారంలో సూచించిన అంశాలను పూర్తి సమాచారంతో పంపాలి. ఆ తరువాత దరఖాస్తు స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకునే వెసులుబాటు ఉంటుంది.

● యూనిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తుంది. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరుస్తారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.

● 2014లోనే శ్రీకారం

వాస్తవానికి 2014లో టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డును ప్రవేశపెట్టింది. ఈ కార్డులను జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి పంపారు. అవి డీఆర్‌డీఏ శాఖకు అప్పచెప్పగా, వాటి బాధ్యత మెప్మాకు అప్పజెప్పారు. మెప్మా అధికారులు కొంత మందికి పంపిణీ చేసి, మిగిలిన వారికి ఇవ్వలేదు. కాకపోతే ఈ కార్డులో వైకల్య శాతం మినహా మిగిలిన వివారలను పొందుపరచలేదు. దీంతో ఈ కార్డుల పట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు.



● యునిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తుంది. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరుస్తారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతాయి.

● 18 రకాల వైకల్యాల చేర్పు

ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18 రకాల వైకల్యాలను చేర్చారు. వాటిలో న్యూరో సంబంధిత బాధితులు, తలసీమీయా, ఆటిజం, యాసిడ్ బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పూర్తయిన తరువాత కార్డు నెలలోపే నేరుగా తపాలా కార్యాలయం ద్వారా ఇంటికి పంపుతున్నారు. చిరునామా సరిగ్గా లేకపోవడం, లబ్ధిదారుడు అందుబాటులో లేకపోతే ఈ కార్డులు కొన్ని చోట్ల స్థానిక పీహెచ్‌సీలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచనున్నారు. ఐడీ నెంబరు చెబితే కార్డును తీసుకొనేటట్లు వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దనున్నారు.



మంచు దుప్పటిలో ఆలయం

జొన్నవాడలో శుక్రవారం వేకువజామున కురిసిన మంచుతో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం ముసురును తలపించింది. దేవస్థానం పరిసరాలను మంచు దుప్పటి కప్పేయడంతో సమీపంలో ఉన్న మనుషులు కూడా కనిపించలేదు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

ఎల్‌టీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేడ్-2 కింద ఏడు ఖాళీగా ఉన్నాయని, కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు వచ్చే నెల 4లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నీట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● మే 4న పరీక్ష : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్య కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే నీట్ మే 4వ తేదీ జరుగుతుందని, దీనికి పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నీట్ నిర్వహణపై సమన్వయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4వేల మందికిపైగా విద్యార్థులు నీట్‌కు హాజరవుతారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మాత్రమే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయాలని సూచించారు. ఆయా కేంద్రాలు నెల్లూరు నగరానికి దగ్గరగా ఉండేలా చూడాలని, రవాణా, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల్లో పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు, డీఈవో బాలాజీరావు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ శంకరయ్య, సీనియర్ అధ్యాపకులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గోదాముల వద్ద నిరంతర నిఘా ఉండాలి

నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల గోదాముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను ఆయన శుక్రవారం పరిశీలించారు. గోదాముల పరిసరాల్లో సైతం భద్రతాపరంగా అన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనూష, తహసీల్దారు షఫీమాలిక్, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు షేక్ అల్లాఉద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐతో కలిసి నిరసన తెలిపారు. అల్లాఉద్దీన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల ఆస్తులను దోచుకునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్న భావన కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జియా ఉల్ హుక్, ముస్లిం లీగ్ జిల్లా అధ్యక్షుడు షఫీ, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్, ఈసీఐ నేత సిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెహమాన్, సంజయ్‌కుమార్, సుధీర్, మల్లికార్జు న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు బ్యాంక్ ఖాతాల్లో పింఛను

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు బ్యాంక్ ఖాతాల్లో పింఛను వేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి చెప్పారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో దివ్యాంగ విద్యార్థులు మూడు నెలలకు ఒకసారి పింఛను తీసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఏ నెలకానెల పెన్షన్ పొందే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. బ్యాంకు ఖాతా ద్వారా పింఛను పొందడానికి విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలు స్థానిక సచివాలయంలో సమర్పించాలన్నారు. ఆ తర్వాత విచారణ జరిపి అర్హుల ఖాతాల్లో పింఛను నగదు జమ చేస్తారని చెప్పారు.

● అవినీతి లేకుండా పెన్షన్ల పంపిణీ

ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని నాగరాజకుమారి తెలిపారు. శనివారం సాయంత్రానికి పెన్షన్ మొత్తాన్ని సచివాలయ అడ్మిన్లు డ్రా చేస్తారని, ఏప్రిల్ 1న పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 306517 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని, 6400 మంది ప్రభుత్వ సిబ్బంది పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఒకటిన టెన్త్ సోషల్ పరీక్ష

నెల్లూరు(విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఏప్రిల్ 1వతేదీ సాంఘిక శాస్త్రం (సోషల్ స్టడీస్) పరీక్ష జరుగుతుందని డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న జరగాల్సిన పరీక్షను రంజాన్ పండుగ సందర్భంగా మంగళవారానికి వాయిదా వేశారన్నారు. ఈ మార్పును విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు. కాగా, శుక్రవారం టెన్త్ విద్యార్థులకు జీవశాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 29,100 మంది విద్యార్థులకుగాను 28,780 మంది హాజరుకాగా 320 మంది గైర్హాజరైనట్లు డీఈవో పేర్కొన్నారు. 51 కేంద్రాలను అధికారులు పరిశీలించారని తెలిపారు. అలాగే, ఓపెన్ స్కూల్ టెన్త్ అభ్యాసకులకు సోషల్ పరీక్ష జరిగిందని, 1506 మందికి 1298 మంది హాజరుకాగా 208 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

తమిళనాడుకి చేరిన కండలేరు నీరు



ఆంధ్రా- చెన్నై సరిహద్దులోకి ప్రవేశించిన నీటిలో పూలు చల్లుతున్న నీటి అధికారులు

రాపూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కండలేరు నుంచి 500 క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ ప్రాజెక్ట్ అధికారులు సోమవారం తమిళనాడుకు విడుదల చేశారు. కాగా శుక్రవారం ఉదయం సుమారు 50 క్యూసెక్కుల నీరు తమిళనాడు బోర్డర్‌లోకి ప్రవేశించాయి. దీంతో అక్కడి అధికారులు ఆ నీటిలోకి పూలు చల్లి హర్షం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌పై నేడు శిక్షణ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ విధానంపై శనివారం శిక్షణ కార్యక్రమం జరుగుతుందని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నెల్లూరులోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే శిక్షణకు దస్తావేజు లేఖరులందరూ హాజరుకావాలని కోరారు.

ఉగాది వేడుకలకు ఏర్పాట్లు చేయండి

● డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయభాస్కర్‌రావు సంబంధిత అధికారులకు సూచించారు. ఉగాది వేడుకల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో ఉగాది వేడుకలు జరుగుతాయని చెప్పారు. పంచాంగ శ్రవణం, వేద పఠనం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వ హించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అధికారులందరూ తెలుగు సంప్రదాయ దుస్తులతో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సాంస్కృతిక మండలి కన్వీనర్, డీడీ ఐపీఆర్ కే సదారావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, హార్టీకల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, డీపీవో సత్యవాణి, దేవదాయ శాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీవో వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫాప్టో జిల్లా చైర్మన్‌గా కంచర్ల మధుసూదనరావు



కంచర్ల మధుసూదనరావు

కావలిటౌన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫాప్టో) జిల్లా చైర్మన్‌గా కంచర్ల మధుసూదన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న మధుసూదన్‌రావు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని గుర్తించిన ఫాప్టో రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మధుసూదనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యావిధానాలు, విద్యాశాఖ సమస్యలు తదితర బృహత్తర బాధ్యతలు నిర్వర్తించే భాగ్యాన్ని కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. విద్యాశాఖ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకత్వం సలహాలు సూచనలతో అధికారుల సంప్రదింపులతో కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ రిటైర్‌మెంట్ ఉద్యోగులకు 6200 కోట్లు బకాయిలు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్, జీపీఎస్‌లు రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

ఏప్రిల్ 7 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిపేస్తాం..

● నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించండి ● అధికారులకు ఆశాల వినతి

నెల్లూరు (వైద్యం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ. 3500 కోట్ల బకాయిలు ఇవ్వాల్సి ఉందని, వాటిని వెంటనే చెల్లించాలని లేకుంటే ఏప్రిల్ 7వతేదీ నుంచి వైద్యసేవలు నిలిపేస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్(ఆశా) నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం నెల్లూరులో కలెక్టరేట్ ఏవో విజయకుమార్‌కు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్‌కు వినతిప త్రాలు అందించారు. అనంతరం ఆశా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎల్ నారాయణరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం భారీగా బకాయిలు ఇవ్వాల్సి ఉందన్నారు. దీంతో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఏప్రిల్ 7 నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య చికిత్సలు నిలిపివేస్తామని చెప్పారు. అన్నీ రకాల వైద్య సేవలు కూడా ఆపేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ మురళీశంకర్‌రెడ్డి, డాక్టర్ హజరత్‌కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏవోకి వినతిపత్రం అందచేస్తున్న ఆశాలు

స్వర్ణాంధ్ర అమలుకు కమిటీలు వేయండి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర - 2047 విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆనంద్ జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి నరసింహారావుకు సూచించారు. ఈ అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నెల్లూరు నగర కమిషనర్ సూర్యతేజతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక శాసన సభ్యులు చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు సభ్యులుగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా కమిటీలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఈ కమిటీలను త్వరగా నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారిని ప్రశ్నిస్తున్న మల్లమ్మ గుంట గ్రామస్థులు

విద్యుత్ కోతలపై గ్రామస్థుల నిరసన

రాపూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలపై మండలంలోని మల్లమ్మగుంట గ్రామస్థులు శుక్రవారం రాపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 400 గృహాలు ఉన్న గ్రామంలో గత కొద్దిరోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో విసుగు చెందిన గ్రామస్థులు విద్యుత్ స్టేషన్ ముందు ధర్నా చేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. విద్యుత్ సమస్యలపై ఎస్ఈ, జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందచేస్తామని తెలిపారు.

వీఎస్‌యూలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎంబీఏ విభాగాధిపతి సాయి స్రవంతి, కంపెనీ ప్రతినిధులు మహదేవ్, గౌతమ్

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో శుక్రవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఐటీ సంస్థ ఒరిసెంక్ టెక్నాలజీస్ సభ్యులు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. సెలెక్షన్‌లో ఎంబీఏ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రౌండ్లలో అర్హత సాధించిన విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కేవీ.మహదేవ్, గౌతం, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్, ఎంబీఏ విభాగాధిపతి సాయి శ్రవంతి, అధ్యాపకులు డాక్టర్ ఎల్ అరుణ, చెంచురెడ్డి ఉన్నారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న వాఘ్ బక్రీ ఫౌండేషన్ ప్రతినిధులు

'అక్షయపాత్ర'కు ఎలక్ట్రికల్ వాహనాల విరాళం

వెంకటాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డులోని పరిశ్రమల కేంద్రంలో ఉన్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు శుక్రవారం వాఘ్ బక్రీ టీ గ్రూప్ సంస్థ సభ్యులు నాలుగు ఎలక్ట్రికల్ వాహనాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సామాజిక విభాగం అధిపతి అజయ్ సిసిలియా, దక్షిణ విభాగం అధిపతి పీవీ సురేష్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాసలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వాహనాలతో జిల్లాలోని 80ప్రభుత్వ పాఠశాలల్లోని 8వేల మంది పిల్లలకు మధ్యాహ్నభోజనాన్ని సరఫరా చేస్తామని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి ప్రేమ్ భక్తిదాస తెలిపారు.